Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 325 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 డిసెంబర్ 2023 గురువారం పేజీలు : 4

## షాకు చరిత్ర తెలియదు: రాహుల్

న్యూఢిల్లీ : కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు చరిత్ర తెలియదని, దాన్ని మార్చి రాస్తూనే ఉంటారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కశ్మీర్ సమస్యకు కారణం నెహ్రూయేనంటూ రాజ్యసభలో అమిత్ షా విమర్శల దాడి గురించి విలేకరులు ప్రస్తావించగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా విమర్శల ఉద్దేశం... కుల గణన అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చడం, దేశం డబ్బు ఎవరి చేతుల్లోకి వెళుతోందనే విషయాన్ని పక్కదారి పట్టించడమేనని చెప్పారు. వీటిపై చర్చించాలంటే బీజేపీకి భయమని, అందుకే పారిపోతోందన్నారు. బీజేపీ ఛత్తీసగఢ్, మధ్యప్రదేశ్ సీఎం పదవులను గిరిజన, ఓబీసీ నాయకులకు ఇవ్వడాన్ని విలేకరులు ప్రస్తావించగా రాహుల్ స్పందిస్తూ ఛత్తీసగఢ్‌లో తాము కూడా ఓబీసీనే సీఎంను చేశామన్నారు.



# పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ భేటీ

### కేసీఆర్ కోసం గట్టిగా ప్రిపేర్ అవుతున్న రేవంత్... తెరపైకి కీలక విషయం!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తాజాగా ఈ నెల 14న ప్రారంభం కాబోతున్న అసెంబ్లీ సమావేశాల్లో సరికొత్త దృశ్యం ఆవిష్కృతం కాబోతుంది. రాష్ట్రం ఏర్పడినప్పటినుంచీ అధికారంలోనే ఉన్న బీఆరెస్స్ నేతలు.. ఇకపై ఫస్ట్ టైం ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నారు. ఇక దశాబ్ద కాలంగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి గట్టిగా ప్రిపేర్ అవుతున్నారని తెలుస్తుంది. అవును... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచీ అధికారంలో ఉన్న బీఆరెస్స్ పాలనలో ఏయే శాఖల్లో పరిస్థితి ఎలా ఉంది, ఆర్థిక పరిస్థితి ఇంకెలా ఉంది మొదలైన విషయాలపై అసెంబ్లీ వేదికగా గత ప్రభుత్వాన్ని కడిగిపారేస్తూ.. ప్రజలకు స్పష్టమైన వివరణ ఇచ్చే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రిపేర్ అవుతున్నారని తెలుస్తుంది. ఇందులో భాగంగా సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయిస్తున్నారని సమాచారం. ఏపీ అసెంబ్లీలో గత ప్రభుత్వ పనితీరు, నాటి ముఖ్యమంత్రి చేసిన కార్యక్రమాలు, అందులో జరిగిన అవకతవకలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలాలూ ప్రదర్శిస్తూ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్... ప్రతిపక్షాన్ని కార్నర్ చేసిన సంగతి తెలిసిందే. వాదించడానికి, కవర్ చేసుకోవడానికి ప్రతిపక్ష సభ్యులకు అవకాశం లేకుండా... లైవ్ ఇచ్చినంత పనిచేశారు! పలు వీడియో బైట్లను, జీవోలను ప్రజలకు చూపించారు.

ఈ సమయంలో తెలంగాణలో కూడా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ డిజిటల్ వాయింపే లక్ష్యంగా రేవంత్ రెడ్డి కూడా సిద్ధపడుతున్నారని, ఆ దిశగా ప్రణాళికలు రచిస్తున్నారని అంటున్నారు. దీంతో ఈసారి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరింత రసవత్తరంగా ఉండబోతున్నాయని అంటున్నారు పరిశీలకులు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రధానంగా విద్యుత్ శాఖ, ధరణి పోర్టల్, ఆర్థిక శాఖ, పరిశ్రమల శాఖ వంటి కీలక శాఖలపై ప్రత్యేక దృష్టి సారించిన రేవంత్... ఆయా శాఖల పనితీరును శ్రద్ధగా పర్యవేక్షిస్తున్నారని తెలుస్తుంది! ఇప్పటికే విద్యుత్ శాఖ రూ. 85వేల కోట్ల అప్పుల్లో ఉందనే విషయం బయటకు వచ్చింది. మరోపక్క పౌర సరఫరాల శాఖలోనూ రూ. 65వేల కోట్లు అప్పు ఉందని ఆ శాఖ మంత్రి ఉత్తం తాజాగా వెల్లడించారు. ఇలా ప్రతీశాఖలోనూ ఆర్థిక పరిస్థితి, ఇతర పరిస్థితి, అవకతవకలు మొదలైన అంశాలన్నింటినీ క్రోడీకరిస్తూ.. సవివరంగా పొందుపరుస్తూ. ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో కేసీఆర్ హయాంలో ఆర్థిక దుబారా జరిగిందంటూ దానిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలుస్తుంది. దీంతో... ఈ నెల 14న ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఇచ్చేందుకు అవసరమైన టెక్నికల్ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో రేవంత్ సీనియర్ అధికారులను ఆదేశించారని తెలుస్తుంది. దీంతో... ఈ దఫా అసెంబ్లీ నియోజకవర్గాల్లు గతంలో ఎన్నడూ లేనట్లుగా సాగే అవకాశం ఉందని అంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో బీఆరెస్స్ అధినేత కేసీఆర్ యశోద ఆస్పత్రిలో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో పూర్తి బాధ్యత కేటీఅర్, హరీష్ రావు, కడియం శ్రీహరి మొదలైన కీలక నేతలపై పడే అవకాశం ఉందని అంటున్నారు!



## రేవంత్ రెడ్డివి అలవిగానీ హామీలు.. మేమెందుకు వదిలిపెడతాం..

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలవిగానీ హామీలు ఇచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఆయన చెప్పిన ప్రతీ మాటకు రికార్డ్ ఉందన్నారు. ఆయన్ను తామెందుకు వదిలిపెడతామన్నారు. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని.. రాగానే పెన్షన్ నాలుగు వేలు ఇస్తామన్నారని.. పదిరోజులు ఆగండి 15వేలు రైతు భరోసా ఇస్తాం అన్నారని.. కాని ఇంకా ఇవ్వలేదని విమర్శించారు. మొదటి కేబినెట్‌లోనే ఆరు గ్యారంటీలకు చట్ట బద్ధత కల్పిస్తాం అన్నారు ఏమైందని ప్రశ్నించారు. రుణ మాఫీ చేయడానికి ఎంత ఇబ్బంది పడ్డామో తమకు తెలుసన్నారు. ఎలా చేస్తారో తాము కూడా చూస్తామన్నారు. ఎవరైనా అధికారంలోకి రాక ముందు ఆదాయ లెక్కలు చూసుకుంటారని.. కానీ వీళ్లు మాత్రం ఇప్పుడు లెక్కలు చూసుకుంటున్నారన్నారు. తాము చేసిన ప్రతీ అప్పుకు ఆడిట్ రిపోర్ట్ ఉందన్నారు. వారు చూసుకోక పోతే తమకేం సంబంధమని కేటీఆర్ పేర్కొన్నారు.



# కిక్కు దిగాలి

## తెలంగాణలో లక్ష బెల్ట్ షాపులు క్లోజ్

హైదరాబాద్ : తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాలే దిశగా అడుగులు వేస్తుంది. బెల్ట్ షాపులను క్లోజ్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గ్రామాల్లోని బెల్ట్ షాపులతో యువత మద్యానికి బానిస అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని బెల్ట్ షాపుల క్లోజ్ కు ప్రణాళికలు చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు.

రాష్ట్రంలో బెల్ట్ షాపులను క్లోజ్ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పొందుపరిచింది. మేనిఫెస్టోలో పెట్టినట్లుగానే రాష్ట్రంలో బెల్ట్ షాపులను క్లోజ్ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 2 వేల 620 వైన్స్ లు ఉన్నాయి వైన్స్ షాపులకు అనుబంధంగా గ్రామాల్లో లక్షకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. తెలంగాణలో మొత్తం12 వేల 769 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 6 నుంచి 10 కి పైగా బెల్ట్ షాపులున్నాయి. ఈ లెక్కన యావరేజ్ గా చూస్తే రాష్ట్రంలో లక్ష 10 వేలకు పైగా బెల్ట్ షాపులన్నాయి. 24 గంటల పాటు బెల్ట్ షాపుల్లో లిక్కర్ ను అమ్ముతుండటం, రాష్ట్రంలోని యువత ఎక్కువగా మద్యానికి బానిసగా మారటం, అనాధికారికంగా బెల్ట్ షాపు యాజమానులు దందా చేస్తున్నారన్న ఆరోపణలతో బెల్ట్ షాపులు క్లోజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

బెల్ట్ షాపు లు క్లోజ్ చేయకుంటే వారిపై కేసులు పెట్టేలా ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తుంది. క్కర్సేల్ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.36 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఇటీవల ఎన్నికల కోడ్వల్ల బెల్టుషాపులు బంద్చేశారు. కొత్త లైసెన్సీల వ్యాపారం డిసెంబర్1 నుంచి మొదలైంది. కాబట్టి మళ్లీ కొత్తగా బెల్టుషాపులతో అగ్రిమెంట్లు జరుగుతున్నాయి. హోల్సేల్, రిటైల్పేరుతో రెండు రకాల లిక్కర్దందా నడుస్తోంది. గ్రామాల్లో బెల్టుషాపులు తీసేస్తే ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.16 వేల కోట్ల ఆదాయం తగ్గొచ్చని ఎక్సైజ్శాఖ అంచానా వేస్తుంది.

# లోక్‌సభలో కలకలం

## పబ్లిక్ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన దుండగులు



దిల్లీ: పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగి 22 ఏళ్లు పూర్తయిన రోజే.. మరోసారి లోక్‌సభలో భద్రతా వైఫల్యం చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. బుధవారం లోక్‌సభలో ఇద్దరు దుండగులు గందరగోళం సృష్టించారు. ఓ వ్యక్తి పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకగా.. మరో వ్యక్తి గ్యాలరీ నుంచి ఒక రకమైన పొగను వదిలి భయభ్రాంతులకు గురిచేశాడు. లోక్‌సభలోకి దూకిన వ్యక్తి.. ఎంపీలు కూర్చునే టేబుళ్లపైకి ఎక్కి ‘నల్ల చట్టాలను బంద్ చేయాలి’ అని నినాదాలు చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో అప్రమత్తమైన ఎంపీలు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. అనంతరం భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఈ ఘటనతో వెంటనే స్పీకర్ సభను వాయిదా వేశారు. జీరో అవర్‌లో భాజపా ఎంపీ ఖగేన్ ముర్ము మాట్లాడుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మరోవైపు, అదే సమయంలో పార్లమెంట్ భవనం బయట ఇద్దరు వ్యక్తులు కూడా ఆందోళనకు యత్నించారు. పసుపు, ఎరుపు రంగుల పొగను వదిలారు. దీంతో వారిని భద్రతా సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఓ మహిళ కూడా ఉన్నట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎంపీలు స్పందిస్తూ పార్లమెంట్‌లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. “ఇద్దరు వ్యక్తులు గ్యాలరీ నుంచి వచ్చి పసుపు రంగు గ్యాస్‌ను వదిలారు. ఎంపీలు వెంటనే వారిని పట్టుకున్నారు. ఈ ఘటనతో కొత్త పార్లమెంట్ భవనంలో భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి” అని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సరిగ్గా 22 ఏళ్ల క్రితం ఇదే రోజున పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. 2001 డిసెంబరు 13న లష్కరే తొయిబా, జైషే మహ్మద్ ముఠాలకు చెందిన ఉగ్రవాదులు పార్లమెంట్ ప్రాంగణంలోకి చొచ్చుకొచ్చి కాల్పులు జరిపారు. ఈ ఘటనతో దేశం ఉలిక్కిపడింది. ఈ దాడిలో 9 మంది అమరులయ్యారు. వీరిలో ఆరుగురు దిల్లీ పోలీసులు కాగా.. ఇద్దరు పార్లమెంట్ సెక్యూరిటీ సిబ్బంది, ఒక తోటమాలి ప్రాణాలు కోల్పోయారు. తక్షణమే స్పందించిన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపి ముష్కరులను హతమార్చారు.

**పార్లమెంటులో పొగగొట్టాలు తీసుకువచ్చిన.. ఆ నలుగురు ఎవరు..?**

: లోక్‌సభలో కొందరు దుండగులు చొరబడి ఎంపీలను భయభ్రాంతులకు గురిచేయడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలోనే ఓ వ్యక్తి గ్యాలరీ నుంచి కిందకు దూకుతూ నినాదాలు చేయగా.. మరోవ్యక్తి ఒకరకమైన పొగను వదలడం కలవరం సృష్టించింది. ఇదే సమయంలో పార్లమెంటు బయట మరో ఇద్దరు దుండగులు ఈ తరహాలోనే ఆందోళనలు చేశారు.

వీరందర్నీ అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లోక్‌సభ లోపల పట్టుబడిన వారు కర్ణాటకకు చెందిన సాగర్ శర్మ, మనో రంజన్‌గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరూ మైసూర్‌కు చెందిన వారని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. పార్లమెంటు బయట నిరసన చేసిన ఇద్దరు వ్యక్తుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు. రంగుల పొగను వెదజల్లుతూ ఆందోళనకు దిగిన వీరిద్దరినీ ట్రాన్స్‌పోర్టు భవనం ముందు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పాల్గొన్న మహిళ హరియాణాలోని హిసార్‌కు చెందిన నీలం (42) కాగా, మరో వ్యక్తి మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన అమోల్ శిందే (25)గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. పార్లమెంటు లోపల, వెలుపల జరిగిన ఈ ఘటనలకు సంబంధించి దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం దర్యాప్తు చేస్తుందని అధికారులు వెల్లడించారు.

లోపలికి చొరబడిన ఇద్దరు వ్యక్తులు ఓ ఎంపీ సిఫార్సుతోనే వారిద్దరు లోనికి చేరినట్లు తెలుస్తోంది. అయితే, కట్టుదిట్టమైన భద్రతావ్యవస్థ ఉన్నప్పటికీ వాయువును వెదజల్లే గొట్టాలను లోనికి ఎలా తీసుకెళ్లారనే విషయం మిస్టరీగా మారింది. ఇది కచ్చితంగా భద్రతా వైఫల్యమేనని పలువురు ఎంపీలు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## మోడీ పొగడకపోవడమే శాపం

## సీఎం సీటు పోయిందే!

ఛత్తీస్‌గఢ్ పార్టీ బాధ్యతలను భుజానికెత్తుకుని.. కేవలం 23 రోజుల్లో రాష్ట్రమంతా తిరిగి బీజేపీని అధికారంలోకి తెచ్చిన మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌ను అగ్రనాయకత్వం సీఎం పోస్టు ఇవ్వకుండా పక్కన పెట్టిన వ్యవహారం.. బీజేపీ నేతలకు ఇంకా మింగుడు పడనేలేదు. అయితే.. ఎవరు ఏమనుకున్నా.. తమకెందుకు.. తమవారైతే చాలనే ధోరణితో ఉన్నారో ఏమో.. బీజేపీ పెద్దలు మధ్యప్రదేశ్‌లోనూ ఇదే రాజకీయ తంత్రానికి తెరదీశారు. ఇక్కడ కూడా పార్టీ కోసం శ్రమించి.. అనేక మాటలు పడి.. పార్టీని గెలుపు తీరాలకు చేర్చిన మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ను పక్కన పెట్టేసింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ను బీజేపీ ఎంపిక చేసింది. ఆయనను పార్టీ శాసనసభాపక్ష నేతగా కొత్త ఎన్నికైన ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ను కాదని ఈ సారి పార్టీ అధిష్ఠానం మోహన్ యాదవ్ వైపు మొగ్గు చూపడంతో అందరూ కొద్ది సేపు నివ్వెర పోయారు. అనంతరం తేరుకుని.. జై కొట్టారు.

**చోటా నేత :** మధ్యప్రదేశ్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన మోహన్ యాదవ్ చాలా చోటా నేతగా భావిస్తారు. అయితే.. ఆయనను ఎంపిక చేయడం పట్ల.. కేంద్రంలోని మోడీ, అమిత్ షాల ద్వయం పాత్ర ఉందని చెబుతున్నారు. ఈ సందర్భంగా మోహన్ మట్లాడారు. "నాలాంటి చిన్న నాయకుడికి బాధ్యతలు అప్పగించినందుకు కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో నా శక్తిమేరకు కృషి చేస్తాను" అని తెలిపారు.

**పొగడకపోవడమే పాపం! :** ఎన్నికల వరకు సీఎం పోస్టులో ఉన్న శివరాజ్‌శింగ్ చౌహాన్.. పేదల నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన చాలా సాదాసీదాగా వ్యవహరిస్తారనే పేరుకూడా ఉంది. ఎవరితోనూ ఆయన కయ్యాలు పెట్టుకోరు. అలాగని ఎవరినీ ఆయన పొగడ్తలతో ముంచెత్తరు. రాష్ట్రానికి అనేక మార్లు ప్రధాని మోడీ వచ్చినా.. ఆయనను ప్రొటోకాల్ ప్రకారమే చూసుకున్నారు తప్ప.. ఎదురేగి స్వాగతాలు.. పలకడం, అతి చేయడం శివరాజ్ చేయలేదు. అదేసమయంలో అందరూ రాముడి భజన చేస్తే.. ఆయన ప్రజా భజనే బాగుంటుందని ఎన్నికల సమయంలో వ్యాఖ్యానించారు. ఇదే బీజేపీని తీరం దాటించింది. అయితే..ఇ లా మోడీని పొగడకపోవడమే పాపం అన్నట్టుగా ఆయనను ముఖ్యమంత్రి పీఠం నుంచి పక్కన పెట్టారని బీజేపీలోని ఓ వర్గం చెబుతుండడం గమనార్హం.

# అగ్రి లీగల్.. రైతులకెంతో న్యాయం




పాలకుర్తి : పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న న్యాయపర సమస్యల పరిష్కారానికి బమ్మెరలో ఏర్పాటు చేసిన న్యాయ కేంద్రం వరంలా మారింది. భూసమస్యల పరిష్కారంలో తొలి మెట్టులోనే రైతులకు ప్రయోజనం కలుగుతోంది. కేంద్రం నిర్వాహకుల సూచనల, సలహాలతో ఎవరిని సంప్రదించాలో న్యాయ సలహాల రూపంలో స్పష్టంగా తెలుస్తున్నాయి. దీంతో అన్నదాతలకు న్యాయ కేంద్రం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని, రైతులకు సైతం కావాల్సినంత సమాచారం లభిస్తోందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అన్నదాతలు వ్యయ ప్రయాసకు లోనుకాకుండా ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారన్నారు.

దేశంలో 70 శాతం ప్రజలు ఇప్పటికీ వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు. ఏటేటా ఆశించిన దిగుబడి వచ్చినా.. రాకున్నా.. వారు సాగును మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ వదలరు. అందరికీ అన్నం పెట్టే రైతులు ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ యుగంలోనూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాగు నుంచి మార్కెట్ వరకు దగాపడుతున్నారు. ఆయా సమస్యల విషయంలో ఎవరిని ఏం అడగాలన్నది రైతులకు తెలియవు. కొందరిని సంప్రదించినా వారికి సరైన న్యాయం, పరిష్కారం మాత్రం దొరకదు. దీంతో ఏటా అప్పులు, కన్నీళ్లు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కర్షకుల సమస్యలు కొన్నైనా పరిష్కరించేందుకు న్యాయ నిపుణులు కొన్నేళ్లుగా శ్రమిస్తున్నారు. వారి అంకితభావం, కృషి, చొరవ వల్లే దేశంలోనే తొలిసారిగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెరలో ఈ ఏడాది మార్చిలో నల్సార్ యూనివర్శిటీ, లీఫ్స్ సంస్థ, న్యాయసేవల అథారిటీ సంయుక్తంగా 'రైతు సాగు న్యాయ కేంద్రం'(అగ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్) ఏర్పాటు చేశాయి.

బమ్మెర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన న్యాయకేంద్రంలో వారానికి రెండురోజులపాటు రైతులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారు. ఒక ప్రత్యేక గది, విభాగంతోపాటు సలహాదారులు కూడా అందుబాటులో ఉండి సలహాలు ఇస్తున్నారు. రైతు స్వాధీనంలో ఉన్న భూమితోపాటు చేతిలో పట్టా పాస్ పుస్తకాలు, రికార్డుల్లో పేరుంటేనే భూమి హక్కుకి భద్రత ఉంటుంది. కానీ ఈ రోజుల్లో అలాంటివి చాలా తక్కువగానే ఉన్నాయని చెప్పాలి. గ్రామాల్లో వేల సంఖ్యల్లో రైతులకు ఇప్పటికీ వారి భూములకు సరైనా పత్రాలు లేవు. చదువుకోని రైతులు ఏం చేయాలో తెలియక ప్రభుత్వ పథకాలు, ఇతరత్రా పత్రాలు, రుణాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలోనూ 90 శాతం ఇలాంటి సమస్యలకు సంబంధించిన వారే వస్తున్నారు. ఫలితంగా ఈ విధానంతో కొంతమేర సత్వర న్యాయం జరిగేలా అవకాశాలు ఉన్నాయి. అక్కడికక్కడే సలహాలు తీసుకొని ఎవరి దగ్గరకు వెళితే సమస్య పరిష్కారమవుతుందో రైతులకు నేరుగా తెలుసుకునే వెసులుబాటు ఏర్పడుతోంది.

స్థలం విషయంలో ముందడుగు

పాలకుర్తి మండలం గూడూరుకు చెందిన లోకనాథం కొన్నేళ్ల కిందట నివాస భూమిని కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా అయింది. అయితే భూమి ప్రభుత్వానిది అని కొందరు ఆయనను అడ్డుకున్నారు. ఓ పథకానికి కేటాయించారు. ఆయన బమ్మెరలోని రైతు న్యాయ కేంద్రానికి వచ్చి వినతిపత్రం ఇవ్వగా నిర్వాహకులు కలెక్టర్.. డీపీఆర్‌కు సమస్యను నివేదించారు. ఉన్నతాధికారులు వచ్చి సర్వే చేయించారు. లోకనాథానికి చెందిన భూమియేనని వారు నిర్ధారించారు. నివాసం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.

రైతులు ఉపయోగించుకోవాలి–నాగభూషణం, సర్పంచి, బమ్మెర

భూసమస్యలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ న్యాయ కేంద్రం సేవలు అన్నదాతలు ఉపయోగించుకోవాలి. ఏం చేయాలో సూచనలు, సలహాలు తీసుకొని న్యాయం దిశగా అడుగులు వేయాలి. వారానికి రెండురోజులపాటు నిర్వహించే కేంద్రంలో ఎక్కువగా ధరణి సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం మార్పులు చేర్పులు మరింతగా చేయాల్సిన అవసరం ఉంది.

నివాసాం కోసం భూమి ఇప్పించండి–ఓ బమ్మెరవాసి

తనకు చెందాల్సిన ఇంటి నివాసం కోసం ఇటీవల ఓ వ్యక్తి రైతు న్యాయ కేంద్రంలో ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. వాస్తవానికి ఆయనకు ప్రస్తుతం ఇల్లు కూడా లేదు. వినతిని స్వీకరించిన నిర్వాహకులు న్యాయం పొందేలా ఏమి చేయాలో సూచనలు, సలహాలిచ్చారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామన్నారు.

# గడువులోపు సాధ్యమేనా!



జగిత్యాల : జిల్లాలో మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సకాలంలో ఇవ్వడం లేదు. బాయిల్డ్, రారైస్ మిల్లుల నుంచి గడువులోగా బియ్యం వస్తేనే గోదాముల్లో నిల్వచేయటం, భారత ఆహార సంస్థకు కేటాయింపు, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక రైళ్ల ద్వారా తరలింపు సాధ్యపడుతుంది. మరోవైపు మిల్లులు, గోదాములు, నిల్వకేంద్రాల్లోని ధాన్యాన్ని మరాడించి తరలిస్తేనే అక్టోబరు–నవంబరు నుంచి చేతికివచ్చే వానాకాలం పంటను సజావుగా కొనుగోలు చేసే వీలుంటుంది.జిల్లాలో 2022–23 వానాకాలం, యాసంగిలకు సంబంధించి కేవలం 21.28 శాతం మాత్రమే బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చారు. అతి తక్కువగా సీఎంఆర్ ఇవ్వటంతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జిల్లాలోని సీఎంఆర్ సేకరణ జాప్యాన్ని తీవ్రంగా పరిగణించగా ప్రస్తుతం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, భారత ఆహారసంస్థ అధికారులు కస్టమ్ మిల్లింగ్ వేగవంతం చేయాలని మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు జరుపుతున్నారు. మరోవైపు కేంద్ర గిడ్డంగుల్లో సకాలంలో బియ్యాన్ని దింపుకునేందుకు హమాలీలను సమకూర్చుకోవటం, గోదాముల్లో ఖాళీస్థలాన్ని అందుబాటులో ఉంచటం తదితరాలపై దృష్టిసారించి ప్రతిరోజూ మిల్లుల నుంచి బియ్యం గోదాములకు రావాలని నిర్దేశించారు. సెప్టెంబరు నెలాఖరు వరకు సీఎంఆర్ పూర్తిచేయాలని గడువును నిర్దేశించినా వర్షాలు, హమాలీల కొరత, రోజుకు 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరాసరిగా రానుండటంతో గడువులోపు బియ్యాన్ని చెల్లించటం అసాధ్యంగా కనిపిస్తోంది.

వానాకాలం ధాన్యం కొనుగోలుపై ప్రభావం..

కేవలం నిరుడు వానాకాలం యాసంగిలకు చెందిన 4.22 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ చెల్లించాల్సి ఉండగా కొందరి నుంచి అంతకుముందు సీజన్లకు చెందిన బియ్యం కూడా కొంత రావాల్సి ఉంది. ఆరుబయటే ధాన్యాన్ని నెట్లుగా పేర్చిఉంచటం, నెట్టింగ్‌పై కప్పిన కవర్లు దెబ్బతినటం, జోరుగా వర్షాలు కురియటంతో చాలాచోట్ల ధాన్యం నిల్వలు తడిసి తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో నాణ్యమైన బియ్యాన్ని, గన్నీసంచులను వెనక్కివ్వటం ఇబ్బందిగా మారింది. మరోవైపు కొన్నిచోట్ల కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మరాడించి బయటి మార్కెట్లో విక్రయించిన ఉదంతాలు కూడా ఉంటుండగా కేటాయించిన ధాన్యం నిల్వల్లేని మిల్లులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సెప్టెంబరులోపు సీఎంఆర్ పూర్తిగాకుంటే మరోసారి గడువును పొడిగిస్తారని ఆశించినా సకాలంలో జిల్లా నుంచి బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించకుంటే వానాకాలం ధాన్యం కొనుగోలుపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సీఎంఆర్‌ను గడువులోగా పూర్తిచేసి వానాకాలం ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టినట్లు పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి చందన్‌కుమార్ తెలిపారు.

# అరకొర వసతులు... తప్పని ఇక్కట్లు

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శని, ఆదివారాలు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఇక్కడ ఉన్న వసతి గృహాలు ఏమాత్రం సరిపోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో భక్తులు ప్రైవేట్ వసతి గృహాలను ఆశ్రయిస్తున్నారు. బస్టాండు ముందున్న 32 గదుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తితిదే దేవస్థానం వసతి గృహాలు శిథిలమయ్యాయి. ఇక్కడ ఉన్నది దేవస్థానం వెనుక గల అతిథి గృహాలే. సామాన్య భక్తులకు ధరలు ఏమాత్రం అందుబాటులో లేకపోవడంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దేవస్థానంలోనూ తగిన వసతులు కల్పించడం లేదని వాపోతున్నారు. సిబ్బంది వ్యాపార దృక్పథంతోనే వ్యవహరిస్తున్నారని... ఆదరణతో కూడిన సేవలు లభించడం లేదని ఇక్కడికి వచ్చేవారు అంటున్నారు. శ్రీరామలింగేశ్వరాలయంలో రుద్రాభిషేకాలు, పూజలకు తగిన ఏర్పాట్లు చేయడం లేదని వాపోతున్నారు. దేవస్థానం ముందు వరకు భక్తుల వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రద్దీ సమయాల్లో మున్సిపల్, దేవస్థానం ఆధ్వర్యంలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఆయా అంశాలను ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా... ప్రస్తుతం



ఉన్న ధర్మశాలల్లోనే పూర్తిగా వసతులు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతీ భక్తుడికి పూర్తి స్థాయిలో సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి మల్లారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

శామీర్ పేట(గరుడ వార్త) : భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి మల్లారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కేశవరం తండా గ్రామ పరిధిలోని సర్వేనెంబర్లు 33, 34, 35 లలో 47 ఎకరాల 18 గుంటల గిరిజనుల భూమిని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అప్పటి అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అర్ధరాత్రి స్థానిక ఎమ్మార్వో వాణి రెడ్డి అధికారుల సహాయ సహకారాలతో కేతావత్ బిక్షపతి కుటుంబ సభ్యులైన గిరిజనులను



మభ్యపెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని. ఈ రిజిస్ట్రేషన్ జరగడం కోసం మల్లారెడ్డితో పాటు స్థానిక బిఆర్ఎస్ నాయకులు సహకారం అందించారు అని అన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడి ఇటువంటి భూకబ్జాలను అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో చేసి ఉన్నారు. వారి అధికారం పోవడంతో గిరిజన బిడ్డలైన కేతావత్ బిక్షపతి కుటుంబ సభ్యులు ధైర్యం చేసి స్థానిక శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టడంతో పోలీస్ అధికారులు ఈరోజు మాజీ మంత్రిపై 420 సెక్షన్ కింద చీటింగ్ కేసు,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేశారు.కావున అధికారులు నిజాయితీతో ఇప్పటికైనా పూర్తి విచారణ జరిపించి మంత్రి మల్లారెడ్డి భూకబ్జాలను అన్నిటిని బయటపెట్టి అతనిని, వారి అనుచరులను కఠినంగా శిక్షించాలని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# కేసీఆర్ పాలన అంతమొందించాలన్న ఆకాంక్ష నెరవేరింది:చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

శామీర్ పేట(గరుడ వార్త) : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ బుధవారం హైదరాబాద్ నుండి చెన్నూరు నియోజకవర్గ పర్యటన వెళుతున్న సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హకీంపేట్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని,కెసిఆర్ రాక్షస పాలన అంతమొందించాలన్న ఆకాంక్ష నెరవేరింది అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేము ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు హామీలను అమలు చేసినామని, మిగతా హామీలను కూడా అమలు చేస్తామన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు పెంపు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి బాలేష్,టిపిసిసి కార్యదర్శి మహిపాల్ రెడ్డి,తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ,మాజీ ఉపసర్పంచ్లు శంకర్ గౌడ్,బిక్షపతి,మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళి గౌడ్, యాదగిరి,మోహన్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్,మున్సిపల్ కాంగ్రెస్ అనుబంధ సంఘాలు బీసీ సెల్,కిసాన్ సెల్,మైనార్టీ సెల్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,ధర్మారెడ్డి,జాఫర్,జగదీష్ గౌడ్,మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రాంచందర్ యాదవ్,మున్సిపల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూములు గల్లంతు!

మోత్కూరు : మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో ఇలాంటి బాధితులు బోలెడు మంది. రామాపురం, మేళ్లచెరువు గ్రామాల్లో సెంటు భూమి లేని కొందరికి నాలుగైదు ఎకరాలున్నట్టు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చేశారు. ఇలా జరగడం వల్ల అసలైన రైతుల భూమి రికార్డుల్లో మాయమైంది. మేళ్లచెరువు, వేపలమాధారం, రేవూరు రెవెన్యూ గ్రామాల్లోని పలు సర్వే నంబర్లలో పదుల సంఖ్యలో రైతుల పట్టా భూములు గల్లంతయ్యాయి. భూమిని రైతులు సాగు చేసుకుంటున్నా.. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం అదృశ్యమైన వైనం తాజాగా వెలుగుజూసింది. దందాకు వేదికలు మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో రెవెన్యూ సిబ్బంది కొందరు, దళారులు కుమ్మక్కై కార్యాలయాలనే తమ దందాకు వేదికలుగా చేసుకుంటున్నారు. కొత్త మండలమైన చింతలపాలెంలో ఇప్పటికీ పది మంది తహసీల్దార్లు మారారంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మేళ్లచెరువు, రేవూరు, వేపలమాధారం పరిధిలోనూ అసైన్డ్ భూముల కబ్జాకు తెగబడుతున్నారు. ఎకరాలకొద్దీ క్రయవిక్రయాలు జరుపుతున్నారు. అనధికార సెటిల్‌మెంట్లతో రూ.లక్షల్లో దండుకుంటున్నారు. తాజాగా పై మూడు గ్రామాల్లో జరిగిన సెటిల్‌మెంట్లు అధికారులనే ఆశ్చర్యానికి గురిచేశాయి. చింతలపాలెం మండలం వజినేపల్లి, దొండపాడు, చింతలపాలెం, వెల్లటూరు రెవెన్యూలోనూ పట్టా భూములను మింగేసిన ఘటనలు వెలుగుజూస్తున్నాయి. ఇలాంటి మాయలకు చెక్ పెట్టేందుకు ఆ మధ్య ఏకంగా జేసీ వచ్చి చింతలపాలెం రెవెన్యూ కార్యాలయం ప్రధాన రికార్డుల బీరువాను సీజ్ చేయించాల్సి వచ్చింది. అయినా దందాకు బ్రేకులు పడలేదని రైతులు ఆవేదనలో ఉన్నారు.వారూ వీరూ ఒక్కటై..: ఈ ప్రాంతంలో వేల ఎకరాలు కొన్ని సిమెంటు కంపెనీల అధీనంలో ఉన్నాయి. ఇవిగాక ఆయా కంపెనీల్లోని కొందరు ఉద్యోగులు రెవెన్యూ కార్యాలయాల సిబ్బందితో కుమ్మక్కై రైతుల పట్టా భూముల్ని కొల్లగొడుతున్నారు.

# ఆరోగ్య సమాచారం.. డిజిటల్‌లో నిక్షిప్తం



ధర్మపురి : వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమగ్ర సమాచారాన్ని డిజిటల్‌గా నమోదు చేసి ఆరోగ్య గుర్తింపు కార్డులను అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ విధానాన్ని(ఆభా) ప్రవేశపెట్టింది. దేశ వ్యాప్తంగా ప్రతీ వ్యక్తికి సంబంధించి ఆరోగ్య సమాచారం ఇందులో నిక్షిప్తం కానుంది. ఇప్పటికే ఆభా కార్డు పేరుతో లక్షలాది మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రతీ వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని ఈ డిజిటల్ కార్డులో నిక్షిప్తం చేసేందుకు దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని 20 మండలాల్లో ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి దాదాపు 2,13,225 మంది వివరాలను నమోదు చేశారు. చాలామంది తమ వివరాలను ఫోన్‌ద్వారా ఆన్‌లైన్ చేసుకోగా మరికొందరు ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులను తీసుకుంటున్నారు. ఆధార్ కార్డు ఉన్న ఏ వయసువారైనా ఈ కార్డు తీసుకోవచ్చు. ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ ఉంటే సరిపోతుంది. అభాలో నమోదు చేసుకున్న తర్వాత మన ఆరోగ్య సమాచారం ఎవరికీ తెలియకూడదనుకుంటే మన ప్రొఫైల్‌లో మన అకౌంట్‌ను డీ యాక్టివేట్ చేసుకోవడంతో పాటు ఖాతా తొలగించుకునే అవకాశం ఉంది.

**అందరూ అవగాహన పెంచుకోవాలి**

జిల్లాలో ఇప్పటికే ఆశ వర్కర్లు ఇంటింటా ఆభా కార్డు వివరాలు నమోదు చేయించారు. ఎవరికి వారు ఫోన్ ద్వారా సైతం వివరాలను నమోదు చేసుకోవచ్చు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆభాలో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఒక్కరూ ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మన సమాచారం గోప్యంగా ఉండాలని అనుకుంటే అన్‌లైన్‌లో అప్షన్లు సైతం నమోదు చేసుకోవచ్చు.

డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య ఉపవైద్యాధికారి

**నమోదు విధానం ఇదీ...**

గూగుల్‌లోకి వెళ్లి ఏబీహెచ్‌ఏ అని నమోదు చేయగానే కింద క్రియేట్ ఏబీఎచ్‌ఏ నెంబర్ యూసింగ్ అని ఉంటుంది. దానిపైన క్లిక్ చేసి ఆధార్ నెంబరు నమోదు చేయాలి. అనంతరం నిబంధనలను చదివి అగ్రీని ఎంపిక చేసుకోగానే ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ, ఫోన్ నెంబర్‌ను నమోదు చేయగానే మన ప్రొఫైల్‌తో 14 అంకెలు గల ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా ప్రారంభమవుతుంది. ఈ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మన ఖాతాలో ఎడమ వైపు ఎడిట్ ప్రొఫైల్, సెట్ పాస్‌వర్డ్, రీ కేవైసీ వెరిఫికేషన్, డీ యాక్టివేట్, డిలీట్ అనే అప్షన్లు ఉంటాయి.

**ఉపయోగం ఇలా...**

దేశంలోని ఆస్పత్రుల వివరాలు ఇందులో నమోదు చేయడం వల్ల మనం ఏ ఆస్పత్రికి వెళ్లినా వ్యక్తులు చేయించుకునే ఆరోగ్య పరీక్షల వివరాలు, ఎక్స్‌రేలు, ఇతర ఆరోగ్య సమాచారం మొత్తం సంబంధిత వక్తి ఆభా ఖాతాలో నమోదవుతుంది. అవసరాల మేరకు ఇతర ఆస్పత్రులకు వెళ్లినప్పుడు మనవద్ద వైద్య పరీక్షలకు సంబంధించి పాతపత్రాలు లేకపోయినా ఈ ఖాతా ద్వారా మన ఆరోగ్య పరిస్థితిని ఆ వైద్యుడు తెలుసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వాలు కూడా ప్రజలకు ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న సమాచారం తెలుసుకోవచ్చు.

## బడిలోనే భవిష్యత్తు ఆవిష్కరణలు

హైదరాబాద్ : పిల్లలకు వచ్చిన ఆలోచనలకు పదును పెట్టేందుకు, ఈ దిశగా విద్యార్థులు ఆలోచించేలా కొన్ని పాఠశాలల్లో ఎంటర్‌ప్రైజ్ క్లబ్‌లు ఉన్నాయి. పిల్లలు సైన్స్ ఫెయిర్, ప్రొటోటైప్ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా తర్వాత దశకు తీసుకెళ్లేందుకు ఇవి దోహదపడుతున్నాయి. అకడమిక్ ప్రాజెక్ట్‌లు కాకుండా విద్యార్థులకు వచ్చిన ఆలోచలను ఆవిష్కరణల దశకు తీసుకెళ్లేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించేందుకు, మెంటర్‌షిప్ అందించేందుకు ఇన్నోవేషన్ సెంటర్లు ఉపయోగపడుతాయి. ఇప్పటికే ఉన్న టీహబ్, విహబ్, టీవర్క్స్‌ను ఉపయోగించుకొని కొందరు చిన్నారులు అద్భుత ఆవిష్కరణలు చేశారు. వీటికి పరిమితులు ఉండడంతో పాఠశాలల్లోనే ఏర్పాటుకు యాజమాన్యాలు మొగ్గుచూపుతున్నాయి. భారత్ నుంచి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఆవిష్కరణలు మున్ముందు రావాలంటే బాల్యంలోనే వ్యవస్థాపకతకు సంబంధించిన పునాది పడాలని నిపుణులు పేర్కొంటున్నారు. మారుతున్న సాంకేతికతలు కృత్రిమ మేధ, మెటావర్స్, రోబోటిక్స్, గ్రీన్, సైబర్ టెక్నాలజీల వరకు అవగాహన ఉండాలి. వీటిపై పట్టుతో మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లకు సుస్థిర పరిష్కారాలు కనుగొనడం సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఇందు కోసమే పాఠశాల స్థాయిలోనే ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నారు.

**రూ.10 కోట్లతో...**పాఠశాల స్థాయిలో వ్యవస్థాపకత, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించేందుకు టీహబ్ మాదిరి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో రూ.10 కోట్లతో ఇన్నోవేషన్ సెంటర్ నిర్మించబోతున్నారు.



15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ఏర్పాటు చేయబోతున్నారు. రోబోటిక్స్, కృత్రిమ మేధ వరకు అభ్యాస అనుభవాలను పిల్లలు నేర్చుకుంటారు. పూర్వ విద్యార్థులు, ఇతరుల నుంచి నిధుల సమీకరణ ద్వారా ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

**యువ ఔత్సాహికవేత్తలుగా..**

పుట్టి.. పెరిగిన పరిస్థితులు, చుట్టుపక్కల వాతావరణం కారణంగా చదువు అంటే ఉద్యోగానికే అనే భావనతోనే ఎక్కువ మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు. దీన్ని పోగొట్టేందుకు ఎంతోకాలంగా వేర్వేరు సంస్థలు కృషి చేస్తున్నాయి. ఔత్సాహికవేత్తలను ప్రోత్సహించేందుకు టై హైదరాబాద్ ఎంతోకాలంగా పనిచేస్తోంది. ఇందులో విద్యార్థి చాప్టర్లు ఉన్నాయి. వీరు అవగాహన శిబిరాలు, కార్యశాలలు నిర్వహిస్తూ పిల్లల ఆవిష్కరణలను వెన్ను తడుతుంటారు. పదేళ్లకే పుస్తకాలు రాయడం, గేమింగ్, ఇతరత్రా యాప్‌లను రూపకల్పన చేస్తున్నవారు ఉన్నారు. వీటిని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అనుభవజ్ఞులతో మెంటర్‌షిప్ చేయడం, నెట్‌వర్కింగ్, ఇంక్యుబేటింగ్ సదుపాయం కల్పిస్తుంటారు. పాఠశాల్లో ఏర్పాటు చేస్తే మరింత ఎక్కువ మంది విద్యార్థులను ఔత్సాహికవేత్తలుగా తీర్చిదిద్దవచ్చు.

## నిధుల సర్దుబాటే సవాల్..

హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరింది. హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి కొన్ని మౌలిక వసతుల ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మ్యానిఫెస్టోలో చేర్చింది. వాటిలో 63వ అంశంగా మెట్రోరైలు విస్తరణను పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మెట్రో కొత్త మార్గం తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా దిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మన దగ్గర నాలుగేళ్ల క్రితం పూర్తయిన మెట్రో మొదటిదశ తప్ప తదుపరి విస్తరణ కాగితాలకే పరిమితం అయ్యింది. ప్రణాళికలు భారీగా ఉన్నా ఆచరణలో ముందడుగు పడలేదు.

**ఎన్నికల హామీలుగా..**

భారాస అధికారంలోకి వస్తే 415 కి.మీ. మెట్రో విస్తరణ పనులు చేపడతామని ప్రకటించింది. కానీ ఆ పార్టీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒకటే మార్గాన్ని తమ ఎన్నికల ప్రణాళికలో చెప్పింది. ఎల్బీనగర్– ఆరాంఘర్– మెహిదీపట్నం–బీహెచ్‌ఈఎల్ మార్గాల్లో మెట్రో నిర్మిస్తామని హామీ ఇచ్చింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఎం వద్దనే ఉండటంతో త్వరలోనే ఆయన మెట్రోపై సమీక్ష చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు అంటున్నాయి. విమానాశ్రయ మెట్రోతో పాటూ, కాంగ్రెస్ హామీ ఇచ్చిన కొత్త మార్గం విస్తరణ డీపీఆర్ రూపకల్పన తదితర అంశాలు సీఎం




దగ్గర చర్చకు రానున్నాయని అంటున్నారు.

**కొత్త మార్గమిలా..**

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు మెట్రోరైలు మార్గం ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్–మెహిదీపట్నం–బీహెచ్‌ఈఎల్ వరకు దాదాపుగా 42 కి.మీ. ఉంటుంది. ఇది చేపట్టాలంటే రూ.10వేల కోట్లపైనే అవుతుంది. దీనికంటే ముందు నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు 5 కి.మీ. మార్గాన్ని పూర్తిచేయాలి. ఇది రెండో దశలో ఉంది. రూ.1,250 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అంతకంటే ముందు విమానాశ్రయ మెట్రో టెండర్లు పూర్తయి ఎల్1 గుత్తేదారును ఎంపిక చేసే దశలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.6,250 కోట్లు వ్యయం అవుతుంది. ఐదేళ్లలో ఇవి పూర్తిచేయాలంటే బడ్జెట్‌లో ఏటా రూ.4వేల కోట్లు మెట్రోకి కేటాయించాల్సి ఉంటుంది. వీటికి నిధుల సర్దుబాటే సర్కారు ముందున్న పెద్ద సవాల్. 'భారాస తిరిగి అధికారంలోకి వచ్చినా తక్షణం నిధులు కేటాయించే పరిస్థితి లేకుండే. కొత్త సర్కారుఎలా అధిగమిస్తారో చూడాలి' అని నగరానికి చెందిన ఎమ్మెల్యే ఒకరుతో అన్నారు.

## పట్టుదల.. ప్రణాళిక



మెట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి కసరత్తు ప్రారంభించారు. గతేడాది సాధించిన దానికంటే మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఈ మేరకు కొన్ని రోజులుగా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో, కొన్ని చోట్ల సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయుడు నిర్ణీత సమయాల్లో బోధిస్తూ విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో 187 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, కస్తూర్బా గాంధీ, ఆదర్శ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 7,630 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఫార్మెటివ్, సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులను పరీక్షలకు ఎలా సిద్ధం చేయాలో నిర్ణయించి ప్రత్యేక తరగతుల్లో వెనుకబడ్డ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలనే ఆలోచనతో బోధన చేస్తున్నారు.

**గత ఫలితాలను దృష్టిలో పెట్టుకుని..**

గత మేలో పదో తరగతి ఫలితాల్లో 84.05 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. అంతకు ముందు ఏడాది 91.37 శాతంతో 21వ స్థానం వచ్చింది. కొవిడ్ కారణంగా రెండుసార్లు పరీక్షలు జరగకపోగా, అంతకు ముందు వరుసగా మూడేళ్లు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. గత మేలో జరిగిన పరీక్ష ఫలితాల్లో అనూహ్యంగా 24వ స్థానానికి పడిపోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల నుంచి కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే పది జీపీఏ సాధించారు. దీంతో ఈ సారి మెరుగైన ఫలితాలు రాబట్టే విధంగా విద్యాశాఖ, ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరముంది.

**అల్పాహారం అందిస్తేనే..**

పది విద్యార్థులకు ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చాలా మంది విద్యార్థులు ఉదయం తరగతులకు ఏమి తినకుండానే వస్తున్నారు. మధ్యాహ్నం వరకు కొంత నీరసించిపోతున్నారు. సాయంత్రం కూడా గంట అదనంగా ఉండాల్సి వస్తోంది. గతంలో దాతలు, విద్యాశాఖ విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు అల్పాహారం అందజేస్తే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రత్యేక తరగతులు ఉపయోగపడుతున్నాయి**

పవన్‌సాయి, విద్యార్థి, మెట్‌పల్లి

ప్రత్యేక తరగతుల్లో రోజుకో సబ్జెక్టులో అంశాల వారీగా చదువుకుంటున్నాం. సందేహాలను, అర్థం కాని విషయాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకుంటున్నాం. పాఠాల పునశ్చరణతో పట్టు సాధించడం సులువవుతుంది. కఠిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టిపెడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుతున్నాం. ప్రత్యేక తరగతులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

**అంశాల వారీగా బోధన**

– మహాలక్ష్మి, విద్యార్థిని, వెల్లుల్ల

ప్రత్యేక తరగతుల్లో గణితం, హిందీ, తెలుగు తదితర సబ్జెక్టుల్లో అంశాల వారీగా ప్రతి విషయాన్ని ఉపాధ్యాయులు క్షుణ్నంగా వివరిస్తూ బోధిస్తున్నారు. పరీక్షలంటే భయం పోయేలా అవగాహన కల్పిస్తున్నారు. అన్ని అంశాల్లో మంచి జీపీఏ సాధించేందుకు ఇప్పట్నుంచే సిద్ధమవుతున్నాము. కఠిన అంశాలకు ఎక్కువ సమయం కేటాయించి సాధన చేస్తున్నాం.

## దస్త్రాల్లో నిషేధం.. క్షేత్రంలో వినియోగం..!

సూర్యాపేట : జిల్లాలోని పురపాలికల్లో ప్లాస్టిక్ నిషేధానికి అడ్డుకట్ట పడటం లేదు. ఎక్కడ చూసినా పాలిథీన్ సంచులే దర్శనమి స్తున్నాయి. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలోని పురపాలికల్లో ప్రధాన కేంద్రాల్లో ప్లాస్టిక్ సంచులు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. వీటి వల్ల పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు తమకేమిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పలు పురపాలికల్లో శివారు కాలనీల్లోని రోడ్ల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తుండటంతో ప్రజల వాడకానికి నిదర్శనంగా చెప్పవచ్చు.చిరు దుకాణాలపైనే చర్యలు పురపాలికలు, పట్టణాల్లో 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని కేంద్ర ప్రభుత్వం గతేడాది ఆదేశాలు జారీ చేసింది. మొదట్లో హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోవటం లేదు. ఏడాది నుంచి పట్టణాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకుండా మిన్నకున్నారు. చిన్న దుకాణాల్లో తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. చిరు వ్యాపారులకు జరిమానాలు విధించి పెద్ద వ్యాపార దుకాణాల్లో మాత్రం తనిఖీలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వినియోగం పెరుగుతూనే ఉంది. వినియోగించిన ప్లాస్టిక్ సంచులను వ్యర్థాలతో కలిపి మున్సిపల్ సిబ్బందికి అందజేస్తున్నారు. రోజుకు పురపాలికల్లో టన్నుల కొద్దీ వ్యర్థాలు సేకరిస్తుండగా అందులో రెండుమూడు క్వింటాళ్ల వరకు ప్లాస్టిక్ సంచులు వస్తున్నాయి. వీటిని మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించకుండా శివారు ప్రాంతాల్లో పారబోస్తున్నారు.అధికారులు కాలు కదిపితేనే అడ్డుకట్ట



పురపాలికలు, పట్టణాల్లో అధికారులు కాలు కదిపితేనే ప్లాస్టిక్ నిషేధానికి అడ్డుకట్ట పడుతుంది. దుకాణాలన్నింట్లో క్షణ్ణంగా తనిఖీలు చేపడితేనే పూర్తిస్థాయిలో వినియోగం తగ్గుతుంది. కనీసం పదిహేనురోజులకోసారి తనిఖీలు చేస్తే నిల్వలు వెలుగుచూస్తాయి. పర్యావరణానికి ముప్పు తగ్గుతుంది. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. తనిఖీలు చేపడతాం రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేటప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ప్రతి దుకాణాన్ని తనిఖీ చేసి ప్లాస్టిక్ నిల్వలు ఉంటే జరిమానా విధిస్తాం. ఈ విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు.

## ప్రాజెక్టులు, రహదారుల అభివృద్ధికి నిధులు అందేనా..?

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులైన ఉత్తమ్, కోమటిరెడ్డిలకు కీలకమైన నీటిపారుదల, రోడ్లు, భవనాల శాఖలు దక్కడంతో ఉమ్మడి జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కీలకమైన సాగునీటి ప్రాజెక్టులతో పాటూ, ఏళ్లపాటూ అభివృద్ధికి నోచుకోని రహదారుల అభివృద్ధికి నిధులు అందుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో శ్రీశైలం ఎడమగట్టు (ఎస్ఎల్‌బీసీ) కాలువ సొరంగంతో పాటూ నక్కలగండి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయి. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం నక్కలగండి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులకు ఒక్కోదానికి హీనపక్షం రూ.300 కోట్ల వరకు ఖర్చు చేస్తే ఆ ప్రాజెక్టులు పూర్తవుతాయి. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా గొట్టిముక్కుల, సింగరాజుపల్లి, చింతపల్లి, కిష్టరాయినిపల్లి, చర్లగూడెం జలాశయాల నిర్మాణం సాగుతోంది. ఇందులో గొట్టిముక్కుల, సింగరాజుపల్లి, చర్లగూడెం పనులు తుది దశకు చేరగా.. చింతపల్లి పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్వాసితులకు సరైన పరిహారం దక్కకపోవడంతో వారు కిష్టరాయినిపల్లి జలాశయ నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారు. మరోవైపు కాళేశ్వరం 16వ ప్యాకేజీలో భాగంగా నిర్మిస్తున్న బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంలో నిర్వాసితులవుతున్న బీఎన్ తిమ్మాపూర్ వాసులకు ఇంకా పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందాల్సి ఉంది. తాజాగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్ సంబంధిత నీటిపారుదల శాఖ మంత్రి కావడంతో తమకు ఇకనైనా న్యాయం దక్కుతుందన్న ఆశ నిర్వాసితుల్లో వ్యక్తమవుతోంది.

**నిర్వాసితులు, భూసేకరణే అసలు సమస్య**

ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్వాసితులు, భూ సేకరణ సమస్యే ప్రధానంగా మారింది. ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంలో ఎక్కువ మంది నిర్వాసితులకు ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని చోట్ల 70 శాతం వరకు చెల్లించినా ఇంకా కొంత పెండింగ్‌లో ఉంది. కొన్ని చోట్ల పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు అందాల్సి ఉంది. మునుగోడు ఉప ఎన్నికల్లో కిష్టరాయినిపల్లి జలాశయంలో నిర్వాసితులవుతున్న లక్ష్మణాపురం, లక్ష్మణాపురం తండా వాసులకు రంగారెడ్డి జిల్లాలో పునరావాసం కల్పిస్తామని అప్పటి అధికారులు, నాయకులు హామీ ఇచ్చినా అది ఇప్పటికీ నెరవేరలేదు. కొత్త మంత్రుల్కైనా తమ సమస్యలు తీర్చుతారని ఇక్కడి బాధితులు ఆశపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, నిర్వాసితుల సమస్యలపై త్వరలోనే మంత్రి ఉత్తమ్ మూడు జిల్లాల అధికార యంత్రాంగంతో సమీక్ష సమావేశం జరుపుతారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**నిర్వహణ కొరవడి**

ఉమ్మడి జిల్లాలో గతంతో పోలిస్తే పదేళ్లలో జాతీయ రహదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే అంతర్గత, రాష్ట్ర రహదారులు మాత్రం నిర్వహణ లేకపోవడంతో కొన్నాళ్లకే గుంతలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా నల్గొండ జిల్లా కేంద్రాన్ని మారుమూల దేవరకొండ ప్రాంతంతో అనుసంధానించే కీలకమైన రహదారి అభివృద్ధి విషయంలో ముందడుగు పడటం లేదు. రాష్ట్రంలోని రెండు కీలక జాతీయ రహదారులైన హైదరాబాద్ – విజయవాడ (ఎన్‌హెచ్ 65)తో హైదరాబాద్ – బెంగళూరు (ఎన్‌హెచ్ 44)ను కలిపే రవాణామార్గమైన నల్గొండ – మల్లేపల్లి 50 కి.మీ. మార్గం మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఈ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. ప్రస్తుతం ఆయనే స్వయంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కావడంతో ఈ రహదారి అభివృద్ధి వేగంగా జరుగుతుందన్న నమ్మకం ప్రయాణికుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు ఉత్తర, దక్షిణ భారత దేశాలను అనుసంధానించే కీలకమార్గమైన చిట్యాల – భువనగిరి 40 కి.మీ. మార్గాన్ని సైతం జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోమటిరెడ్డి గతంలో కోరారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ రహదారి సైతం నిర్వహణలేమితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సైతం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సి ఉంది. మొత్తానికి సంబంధిత మంత్రుల బాధ్యతలతో ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల రహదారుల అభివృద్ధి వేగంగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఆధునిక వైద్యం.. సేవల విస్తరణ

నల్గొండ : బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజు రోజుకు వైద్య సేవలు మెరుగుపడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 100 పడకల ఆసుపత్రి ఆరు నెలల్లో 350 పడకల ఆసుపత్రిగా మారనుంది. భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విద్యార్థులు ఇన్నాళు ఉన్న ఏ బ్లాక్ రెండు, మూడు అంతస్థులు ఖాళీ చేసి నూతనంగా నిర్మించిన అమృత్ నివాస్‌లోకి చేరారు. సదరు బ్లాక్‌లు పూర్తయ్యాయి. సీ బ్లాక్‌లోని ఇన్‌పేషెంట్ వార్డును ఏ బ్లాక్‌లోని పై అంతస్తులకు మార్చనున్నారు. సీ బ్లాక్‌లో పూర్తిస్థాయి మరమ్మతులు చేసి అక్కడా మరిన్ని పడకలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా బీబీనగర్ ఎయిమ్స్‌లో 350 పడకల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**అత్యవసర, డయాలసిస్ సేవలు**

ఎయిమ్స్ ఆసుపత్రి జాతీయ రహదారి 163 పక్కనే ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాల బారిన పడి సకాలంలో వైద్యం అందక పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు వదిలారు. అలాంటి మరణాలను నివారించాలని సంకల్పించిన ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మూడు నెలల్లోపే బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యవసర సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అత్యవసర సేవలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఏ బ్లాక్‌లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు.

**కాలేజ్ ఆఫ్ ఎల్ఐడీ హెల్త్ కోర్స్ ప్రారంభం**

పూర్తిస్థాయి ప్రజావైద్యం అందించాలంటే అన్ని విభాగాల వైద్యులతో పాటు వైద్య పరీక్షలు, ల్యాబ్‌లు, వైద్య పరికరాల వినియోగించేందుకు నిపుణులైన టెక్నీషియన్స్ కూడా అవసరమని డాక్టర్ భాటియా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ చొరవతో ఇటీవల కాలేజ్ ఆఫ్ ఎల్ఐడీ హెల్త్ కోర్స్ ప్రారంభించారు. ఈ కోర్సులో భాగంగా ప్రస్తుతం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, మెడికల్ రేడియో ఇమేజింగ్‌కు సంబంధించిన మూడు కోర్సులను ఒక్కో కోర్సులో 5 మందితో కోర్సు ప్రారంభించి 15 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్సు నాలుగు సంవత్సరాలు ఉంటుంది. ఆ తర్వాత రెండు సంవత్సరాల ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. దశల వారీగా సదరు కోర్సు సీట్ల పరిమితి కూడా పెంచనున్నారు.

**జనవరిలో డీఎం, ఎంసీహెచ్ కోర్సులు ప్రారంభం**

ఎయిమ్స్‌లో ప్రస్తుతం 13 విభాగాల్లో ఉన్న ఎండీ కోర్సును జనవరి నుంచి మూడు విభాగాలు (సైక్యాట్రిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ) అందుబాటులోకి తెచ్చి 15 విభాగాలకు పెంచనున్నారు. అలాగే అదే నెలలో డీఎమ్ న్యూరాలజీ (2), ఎమ్సీహెచ్ పిడియాట్రిక్ (2) అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య విద్యార్థుల వసతి గృహం, హాస్టల్ కోసం బాలికలకు 22 అంతస్తులు, బాలురకు 21 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. అందుకు అనుగుణంగా పనులు ముమ్మరం చేశారు.

**300 వైద్య, 95 గ్రూప్ బీ, సీ పోస్టులకు గ్రీన్ సిగ్నల్**

బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవలు విస్తరిస్తున్నందున అందుకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది నియామకాలకు ఇటీవల బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపగా స్పందించిన కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సదరు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 150 మంది సీనియర్ రెసిడెంట్స్, 150 మంది జూనియర్ రెసిడెంట్స్, 95 గ్రూప్ బీ, సీ పోస్టులు నియమించుకోవాలని ఇటీవల డైరెక్టర్ భాటియాకు పంపిన ఓ లేఖలో పేర్కొంది. అందుకు సంబంధించిన నియామకాలు దిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో డిసెంబరు నెలలో పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నోటిఫికేషన్ జారీచేసే పనిలో నిమగ్నమయ్యారు.దశలవారీగా విస్తరణ డాక్టర్ వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్, బీబీనగర్దశలవారీగా వైద్య సేవలు విస్తరిస్తున్నాం. వైద్య విద్యార్థులకు వసతి గృహా ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి 300 మంది వైద్యులు, 95 నాన్ టెక్నికల్ స్టాఫ్ నియామకాలకు అనుమతులు వచ్చాయి. నియామకాలు అన్ని దిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరుగుతాయి. త్వరలో అందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసి డిసెంబరులో పోస్టులు భర్తీ చేస్తాం. మూడు నెలల్లో అత్యవసర, డయాలసిస్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 15 మందితో కాలేజ్ ఆఫ్ ఎల్ఐడీ హెల్త్ కోర్స్ ప్రారంభించాం. 13 విభాగాల్లో ఉన్న ఎండీ కోర్సును జనవరి నెల నుంచి 15 విభాగాలకు పెంచుతున్నాం

# గాడితప్పిన ట్రాఫిక్.. దారిన పడేదెట్లా!

హైదరాబాద్ :నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. గమ్యం చేరేందుకు వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రధాన రహదారుల్లో సిబ్బంది లేక ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్‌జాం అవుతోంది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల సంఖ్య 18 నుంచి 31కు పెంచినా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు వసూళ్ల దందాతో హల్‌చల్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు లక్ష్యం నిర్దేశిస్తున్నారు. దీంతో ఎటూపాలుపోక కొందరు ఆందోళనకు గురై ఆసుపత్రుల పాలైనట్టు సమాచారం. హోటళ్ల నుంచి నెలవారీ వసూళ్లు చేయట్లేదని ఒక ఏసీపీ ఎస్సైను తీవ్ర పదజాలంతో దూషించడంతో విషయం ఉన్నతాధికారుల వరకూ చేరింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేబీఎస్, చార్మినార్, గోల్కొండ, ట్యాంక్‌బండ్ తదితర పర్యాటక ప్రాంతాల్లో ఇష్టానుసారం వాహనాలు రోడ్లపై నిలపడంతో తరచూ వాహనదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

**ఫొటోలు.. చలానాలకే సరి**

ఎన్నికల తంతు ముగియటంతో ట్రాఫిక్ యంత్రాంగం చలానాలపై గురిపెట్టారు. ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు అట్టహాసంగా ప్రారంభించిన ఆపరేషన్ రోప్ అటకెక్కింది. అర్ధరాత్రి దాటే దాకా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తారనే మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. నిర్దేశిత సమయంలో మాత్రమే నగరంలోకి ప్రవేశించాల్సిన ప్రైవేటు బస్సులు, భారీవాహనాలు ఎప్పుడైనా యథేచ్ఛగా వస్తున్నాయి. రాత్రి 8 గంటలు దాటాక ఎస్సార్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, లక్డీకాపూల్, మెహిదీపట్నం, మలక్‌పేట్



తదితర ప్రధాన మార్గాల్లో బస్సులు రోడ్లపైనే నిలుపుతున్నారు. రాత్రి 11 గంటలకే దుకాణాలు మూసివేయాలనే సీపీ ఆదేశాలు పూర్తిగా అమలుకు నోచుకోవట్లేదు. బంజారాహిల్స్ రోడ్ నెంబరు 1, 10, టోలిచౌకి, అబిడ్స్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటేంత వరకూ ఐస్ క్రీమ్‌పార్లర్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, కాఫీక్లబ్బులు తెరిచే ఉంటున్నాయి. షేక్‌పేట్ నాలా నుంచి గోల్కొండ, టోలిచౌకి, లంగర్‌హౌస్‌కు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ పోలీసులున్నా గంటల తరబడి వాహనాలు బారులు తీరాల్సి వస్తోంది. వాహనాలను నియంత్రించాల్సిన ఫొటోలు, చలానాలకే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి.

**రెచ్చిపోతున్న వసూల్ రాజాలు**

పశ్చిమ మండల పరిధిలో రెండు హోటళ్లు అర్ధరాత్రి దాటేంత వరకూ తెరిచే ఉంటాయి. ఖైరతాబాద్-కూకట్‌పల్లి ప్రధాన మార్గంలోని ఓ హోటల్ బయటే రోడ్డుపై వాహనాలు నిలిపినా చూసీచూడనట్టు వదిలేస్తారు. గతంలో ఈ హోటల్‌లో సిబ్బంది దాడిలో ఒక యువకుడు మరణించటం సంచలనం సృష్టించింది. ఇంతటి కీలకమైన ప్రాంతంలో పనిచేసే ఏసీపీ పెడుతున్న ఒత్తిడి తట్టుకోలేక కార్యాలయంలో కానిస్టేబుల్ అనారోగ్యానికి గురై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. రోజూ బిర్యానీ, స్వీటు ప్యాకెట్లు, కావాలంటూ ఆయన్నుంచి డిమాండ్ పెరగటంతో ఒక ఎస్సై సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే మండలంలోని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలో కొత్త నిర్మాణాలపై కన్నేశారు. ట్రాఫిక్ అనుమతులు లేకుండా ఎలా నిర్మాణం చేస్తారంటూ నెలరోజుల్లో 100 మందికి నోటీసులు ఇచ్చి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. ఉత్తర మండలం పరిధిలో ఒక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రతి నెలా మామూళ్లు అందకుంటే కేసులతో హడావుడి చేయటం గమనార్హం. మరో ఇన్‌స్పెక్టర్ చిరు వ్యాపారాలు కొనసాగాలంటే తన చేతిలో పైసల్ పడాల్సిందేనంటూ తెగేసి చెప్పారని హాకర్లు ఆవేదన వెలిబుచ్చారు.

# సన్నధాన్యానికి అధిక ధరలు

జగిత్యాల : జిల్లా రైతులు పండించిన సన్నధాన్యానికి అధిక ధరలు పలుకుతున్నాయి. వానాకాలంలో 3.06 లక్షల ఎకరాల్లో రైతులు వరిని సాగుచేయగా ఇందులో దాదాపుగా 44 వేల ఎకరాల వరకు సన్నగింజ రకాలున్నాయి. అధిక వర్షాలు, ఉల్లికోడు, మొగిపురుగు, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఎండుతెగులు, కొన్నిచోట్ల సుడిదోమల తీవ్రతతో కొన్నిచోట్ల దిగుబడులు తగ్గినా ప్రస్తుత ధర ఊరట కలిగిస్తోంది. సన్నరకాల్లో ఎకరాకు సరాసరిగా 20-28 క్వింటాళ్ల దిగుబడి ఉండగా ప్రస్తుతం 18-26 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. జగిత్యాల వ్యవసాయ మార్కెట్లో తొలిసారిగా రికార్డు స్థాయిలో సన్నగింజ రకం జైశ్రీరాంకు క్వింటాలుకు రూ.3,150 ధర పలికింది. సన్నరకాలకు రూ.3 వేలకు పైబడి ధర పలకటం ఇదే తొలిసారి. గ్రామాల్లోనూ వ్యాపారులు రూ.2,900 ధరకు జైశ్రీరాం రకాన్ని నేరుగా కొనుగోలు చేస్తున్నారు. హెచ్‌ఎంటీ రూ.2,750, ఆర్‌ఎన్‌ఆర్ రూ.2,556, బీపీటీ రూ.2,500 వరకు సరాసరి ధరలు పలుకుతున్నాయి. నిరుడు, అంతకుముందు సంవత్సరం వానాకాలంలో సన్నరకాలకు తక్కువధరలే పలకగా ప్రభుత్వ కేంద్రాల్లో దొడ్డుగింజ రకాల ధరకే రైతులు విక్రయించారు. ప్రస్తుత సీజన్‌లో దొడ్డుగింజ రకాలకు క్వింటాలుకు రూ.2,203 మద్దతు ధర ఉండగా ఇంతకన్నా చాలా ఎక్కువధర పలుకుతుండటంతో సన్నరకాలను గ్రామాల్లో మధ్యవర్తులు, వ్యాపారులు లేదా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు తాము పండించిన సన్నధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. గతంతో పోలిస్తే సన్నగింజ రకాల సాగువిస్తీర్ణం, దిగుబడి తగ్గటం, ఇతర ప్రాంతాలకు బియ్యం ఎగుమతితో ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇలాగే ధరలు స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సాధారణంగా సన్నగింజ రకాల్లో వానాకాలంలో పోలిస్తే యాసంగిలో చీడపీడల తీవ్రత తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా వస్తుంది. నూకలశాతం పెరుగుతుందని రైతులు యాసంగిలో సన్నాల సాగును తగ్గిస్తుంటారు. కానీ స్టీమ్, బాయిల్డ్ రైస్‌గా మార్చినపుడు నూకలశాతం స్థిరంగా ఉంటుంది. ఇదే తరుణంలో యాసంగిలోనూ నూకలశాతం తక్కువగా ఉండే సన్నగింజ రకాలను వ్యవసాయ వర్సిటీ ద్వారా తమకు సాగుకు అందించాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గల్లీల్లో మత్తు ముఠాల హల్‌చల్



హైదరాబాద్: నగరంలో మత్తు ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. బస్తీలు, కాలనీల్లో పోలీసు గస్తీ లోపాన్ని అనువుగా మలచుకుంటున్నారు. టీఎస్‌న్యాబ్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ వంటి ప్రత్యేక పోలీసు బృందాలు గుర్తిస్తే తప్ప గంజాయి విక్రేతలను గుర్తించలేకపోతున్నారు. పోలీసు కమిషనరేట్ల పరిధిలో పెంచిన ఠాణాల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయి మౌలిక వసతులు, వాహనాలు సమకూర్చ లేకపోయారు. పాత ఠాణాల నుంచే సిబ్బంది, వాహనాలు కేటాయించారు. పండగలు, ఎన్నికలు, బందోబస్తు విధుల్లో తలమునకలైన సిబ్బంది రాత్రిళ్లు గస్తీ చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో 100కు పైగా పెట్రోలింగ్ కార్లున్నాయి. 200కు పైగా ద్విచక్రవాహనాలున్నాయి. ద్విచక్రవాహనాల్లో అధికశాతం సిబ్బంది వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నట్టు సమాచారం.

**దాడిచేసినా.. దోచుకున్నా అంతే**

మాంగార్‌బస్తీలో చిల్లరదొంగలు కొత్తదారి పట్టారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మత్తుమాత్రలు తీసుకొచ్చి యువకులకు విక్రయిస్తున్నారు. ఇటీవల టీఎస్‌న్యాబ్ పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసినప్పుడు బడా రాకెట్ వెలుగుచూసింది. గుల్బర్గాలో ఒక్కో మాత్రను రూ.5కు కొనుగోలుచేసి ఇక్కడ రూ.20కు అమ్ముతున్నట్టు దర్యాప్తులో నిర్ధారించారు. ఈ కాలనీలో 50 మంది వరకూ ఏడాదిగా ఇదే దందా చేస్తున్నారు. మాంగార్‌బస్తీ మత్తు బిళ్లలకు చిరునామాగా మారింది. సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్టల్లోని కొన్ని ప్రాంతాలు గంజాయి విక్రయాలకు కేంద్రమయ్యాయి. ముషీరాబాద్, చిక్కడపల్లి, బోలక్‌పూర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బోరబండ, ఫిల్మ్‌నగర్, బంజారాహిల్స్‌ల్లోని కొన్ని బస్తీల్లో మద్యం బెల్టుషాపుల్లో గంజాయి, దగ్గు మందు, మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్టు టీఎస్‌న్యాబ్ పోలీసులు భావిస్తున్నారు. పలు కాలనీల్లో గంజాయి బ్యాచ్‌లు మత్తులో స్థానికులను బెదిరించడం, సెల్‌ఫోన్లు, నగలు కొట్టేస్తున్నట్టు పోలీసులకు ఫిర్యాదులొస్తున్నాయి. ఉత్తర మండల పరిధి సమీపంలో నలుగురు యువకులు ప్రయాణికులను కత్తితో బెదిరించి సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే బెదిరించినట్టు వద్దని, బస్సులో సెల్‌ఫోన్ పోయినట్టు ఫిర్యాదు చేయమంటూ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. గోల్కొండ, టోలిచౌకిల్లో కొందరు యువకులు ముఠాలుగా ఏర్పడి ఏపీ, ఒడిశా ఏజెన్సీ ప్రాంతాల నుంచి హ్యాష్ ఆయిల్ తీసుకొస్తున్నారు. నివాసాల మధ్య వాటిని నిల్వచేసి మైనర్లతో కొనుగోలుదారులకు చేరవేస్తున్నారు. ఫలక్‌నుమా ప్రాంత పాతనేరస్థులు రాత్రిళ్లు ద్విచక్రవాహనంపై వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారు. నేరాలకు పాల్పడే ముందు గంజాయి తీసుకొని రంగంలోకి దిగుతారు. బైక్‌లపై వెళ్లేవారి కళ్లల్లో కారం కొట్టి వారు కిందపడగానే విలువైన వస్తువులు కొట్టేసి పారిపోతారు.

**ఇప్పుడేం జరుగుతోందంటే..**

సౌత్‌ఈస్ట్ పరిధిలో ప్రధాన పోలీస్‌స్టేషన్ ద్విచక్రవాహనాలు మొరాయించడంతో ఒకే ఒక్క పెట్రోలింగ్ కారుతో కొన్నికాలనీలు చుట్టొస్తున్నామంటూ ఆ ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ తెలిపారు. పశ్చిమమండలం పరిధిలో కొత్తగా ఏర్పాటైన ఠాణా పరిధిలో 20 వరకు బస్తీలున్నాయి. నైజీరియన్లు అధికసంఖ్యలో ఉంటారు. బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో బాంబుపేలుళ్లకు కుట్ర పన్నిన ఉగ్రవాదులు ఇక్కడే పట్టుబడ్డారు. అటువంటి సున్నితమైన ప్రాంతంలో డయల్ 100కు కాల్ వెళ్తే ఘటనాస్థలానికి చేరేందుకు అరగంట సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవల టోలిచౌకి నుంచి ఒక వ్యక్తి పోలీసులకు ఫోన్ చేస్తే పలు ప్రశ్నలు వేసి ఇప్పుడు రావటం కుదరదంటూ వదిలేశారంటూ ఆ బాధితుడు ఆవేదన వెలిబుచ్చారు. దక్షిణ, ఉత్తర, తూర్పు, మధ్య మండలాల పరిధిలో 10-12 పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీ అస్తవ్యస్తంగా ఉన్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. అర్ధరాత్రి దాటేంత వరకూ బార్ అండ్ రెస్టారెంట్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, పాన్‌దుకాణాలు, హోటళ్లు తెరిచి ఉండటాన్ని గుర్తించి నలుగురు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జి మెమోలు జారీ చేసినట్టు సమాచారం.

# వార్డు పాలన.. గాడిన పడేనా?



హైదరాబాద్ : పాలన వికేంద్రీకరణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటైన వార్డు కార్యాలయాలు మొక్కుబడిగా మారాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో 70 శాతం ఆఫీసులు తెరచుకోవట్లేదు. చార్మినార్ జోన్‌లోని 90 శాతం ఆఫీసులు మూతపడగా, ఖైరతాబాద్ జోన్లోని గోషామహల్, మెహిదీపట్నం, ఖైరతాబాద్ సర్కిళ్లలోని వార్డు ఆఫీసులు 70 శాతం మేర, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ జోన్లలో 70 శాతం, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లలో 60 శాతం ఆఫీసులు మూతపడినట్లు కనిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది.. వార్డు ఆఫీసులను వదిలేసి సర్కిల్ కార్యాలయాల్లో కూర్చుంటున్నారు. ఇదేమిటని అడిగితే.. తమ పై అధికారులు వేరే బాధ్యతలను అప్పగించారని చెబుతున్నారు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి అందుబాటులోకి తీసుకొచ్చిన వార్డు పాలన అటకెక్కినట్లయింది.

ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు.. జూన్ 15, 2023న నగరంలో వార్డు పాలన వ్యవస్థ ప్రారంభమైంది. అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కాచిగూడ డివిజన్ ఆఫీసును ప్రారంభించగా.. మిగిలిన కార్యాలయాలను సంబంధిత కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకే రోజు 132 కార్యాలయాల్లో సేవలు మొదలయ్యాయి. 18 ఆఫీసులు తర్వాతి నెల రోజుల్లో అందుబాటులోకి వచ్చాయి. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా, విశాలమైన రహదారి పక్కనున్న భవనాల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఆధునికత ఉట్టిపడేలా వార్డు ఆఫీసులకు నాణ్యమైన కుర్చీలు, కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, బీరువాలు, ఇతరత్రా వస్తువులను సమకూర్చారు. అందుకోసం బల్దియా భారీగా నిధులను ఖర్చు చేసింది.

**నాలుగో స్థాయి పాలనా వ్యవస్థ**

జీహెచ్ఎంసీలో.. కేంద్ర కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, సర్కిల్ ఆఫీసులంటూ మూడంచెల పాలనా వ్యవస్థ ఉండేది. డివిజన్ల కేంద్రంగా ఏర్పాటు చేసిన వార్డు ఆఫీసులను నాలుగో స్థాయి పాలనా వ్యవస్థగా.. అప్పట్లో ప్రభుత్వం అభివర్ణించింది. వీటిలో జీహెచ్ఎంసీ సహాయ మున్సిపల్ అధికారి (ఏఎంసీ) వార్డు పాలనాధికారిగా, ఇంజినీరు, టౌన్ ప్లానర్, ఎంటమాలజిస్టు, పారిశుద్ధ్య జవాను, కమ్యూనిటీ ఆర్గనైజర్, యూబీడీ (అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) సూపర్‌వైజరు, వార్డు సహాయకుడు (జలమండలి), లైన్‌మెన్ లేదా లైన్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్టుతో కలిపి 11 మందితో కార్యాలయాలు పనిచేస్తాయి. కింది స్థాయిలో ఎదురయ్యే రోడ్లపై గుంతలు, వీధి లైట్లు, చెత్త కుప్పలు, ఇంటింటి చెత్త సేకరణ, అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణ, ఖాళీ స్థలాల కబ్జాలు, దోమల వ్యాప్తి, స్వయం సహాయక బృందాలకు రుణాలు, కొత్త బృందాల ఏర్పాటు, పార్కులు, తాగునీరు, మురుగునీటి పైపులైన్లు, విద్యుత్తు స్తంభాల వంటి సమస్యలు వార్డు ఆఫీసుల్లోనే పరిష్కారమవుతాయని ప్రకటించింది. దానికి తగ్గట్లే ప్రారంభంలో అధికారులు లక్ష్యాలను చేరుకున్నారు. పౌరుల ఫిర్యాదులను అదే రోజు లేదా మరుసటి రోజు పరిష్కరించారు. క్రమేణా జోనల్ కమిషనర్లు, సర్కిళ్ల ఉప కమిషనర్లు ఈ ఆఫీసులను గాలికొదిలేశారు.

# వినూత్నం.. అభ్యున్నతికి శ్రీకారం

హైదరాబాద్ : ప్రభుత్వ బడులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలనే సదాశయంతో రాష్ట్ర కళాశాల విద్యాశాఖ అధికారులు 'పిల్లల కోసం' వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను 'కమ్యూనిటీ వాలంటీర్లు'గా ఎంపిక చేస్తూ ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారు బోధిస్తుండగా.. అభ్యసన సామర్థ్యాలను గుర్తిస్తున్నారు. కరోనా ప్రభావంతో అప్పట్లో బడులు సక్రమంగా నడవకపోవడంతో ప్రాథమిక స్థాయిలో సామర్థ్యాలు తగ్గిపోయినట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పిల్లల్లో కనీసం చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, భాగహారాలు వంటి ప్రాథమిక అభ్యసనాల్లో విద్యార్థులు బాగా వెనకబడినట్లు విద్యాశాఖ గుర్తించింది.

జిల్లాలో అమలు ఇలా...జిల్లాలోని 20 మండలాల్లో ఎంపిక చేసిన పాఠశాలలకు డిగ్రీ కళాశాలలో 'జాతీయ సేవా సమితి'లో భాగంగా వాలంటీర్లను ఎంపిక చేశారు. డిగ్రీ మొదటి, రెండు, మూడో ఏడాది చదువుతున్న 268 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఎంపిక చేస్తూ రాష్ట్ర విద్యాశాఖకు సంబంధించిన కామన్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేశారు. వీరంతా డిసెంబరు ఒకటి నుంచి ఈ ఏడాది విద్యాసంవత్సరం ముగింపు వరకు పనిచేస్తూ చిన్నారుల్లో సామర్థ్యాలను పరిశీలించనున్నారు. ఎంపిక చేస్తూ నమోదైన వాలంటీర్లకు ఒక పాఠశాలను కేటాయిస్తూ క్రమసంఖ్య, గుర్తింపు కార్డును జారీ చేశారు. అలా చిన్నారుల కోసం గుర్తింపు పొందిన వాలంటీర్ ప్రతి శనివారం కేటాయించిన పాఠశాలకు వెళుతున్నారు.



విద్యార్థులు వెనకబడిన అంశాలను తెలుసుకుంటూ అదే సబ్జెక్టులో సామర్థ్యాలను పెంచుకునేలా చూస్తారు. మండలాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లోని ప్రాథమిక విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసం వాలంటీర్లు బోధిస్తున్నారు. ఉస్మానియా, పాలమూరు విశ్వవిద్యాలయాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుంచి వీరిని ఎంపిక చేశారు. డిగ్రీ చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో స్థిరపడేందుకు ఇలాంటి అనుభవం ఉపయోగపడుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.పిల్లలు, ఉపాధ్యాయుల్లో ఉత్సాహం: రేణుకాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారిప్రాథమిక స్థాయిలోనే చిన్నారులకు సామర్థ్యాలను పెంచడానికి ప్రభుత్వం పలు పద్ధతులు పాటిస్తోంది. ఏటా కొత్త కార్యక్రమాలతో పిల్లలు, ఉపాధ్యాయుల్లో ఉత్సాహం పెంచుకునేందుకు కృషి చేస్తున్నాం. డిగ్రీ విద్యార్థులతో కొనసాగుతున్న కార్యక్రమంతో చిన్నారులకు మేలు జరుగుతుంది.

# అటకెక్కిన పర్యవేక్షణ

కరీంనగర్ : కరీంనగర్ నగరంతోపాటు పురపాలికల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగైదు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలనే విషయాన్నే ఆయా ఇంటి యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకొనే కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో సూరు నీళ్ల మరో ఇంట్లో పడకూడదని కట్టడి చేసే వారు. ప్రస్తుతం స్లాబులు వేస్తుండగా స్థలమున్నంత వరకు కట్టుకుంటున్నారు. భవిష్యత్తులో జరగరాని ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులనే విషయాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు.

**వాణిజ్య అవసరాలకు వినియోగం**

కరీంనగర్‌లో నివాసిత భవనంగా అనుమతి తీసుకొని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. మూడు అంతస్తుల భవనాలు ఉన్న చోట అయితే కింది అంతస్తులో దుకాణాలు, ఇతర కార్యకలాపాలకు అద్దెకు ఇస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అయితే ఏకంగా వాణిజ్య అవసరాలకే అప్పగిస్తున్నారు. భవనం నాలుగు వైపులా వదలాల్సిన ఖాళీ స్థలంలో ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్లు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.

**అనధికారికమే అధికం..**



అనుమతులకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు అధికమయ్యాయి. ఒకటెండ్రు అంతస్తులకు అనుమతులు తీసుకొని.. అదనంగా రెండు అంతస్తులు అక్రమంగా నిర్మించుకుంటున్నారు. మరికొందరైతే అనుమతుల జోలికే రాకుండా ప్రజాప్రతినిధులతోనే మాట్లాడుకొని.. అధికారులను రాకుండా అడ్డుగోడగా ఉంటున్నారు. సెట్‌బ్యాక్ అనేదే పాటించడంలేదు. ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన నూతన భవనాలు పరిశీలిస్తే స్థలం వదలకుండా, కనీసం పార్కింగ్ లేకుండా నిర్మిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి గేట్లు లోపలి వైపు తెరుచుకోకుండా రోడ్డు వైపు తెరుస్తున్నారు. ఒక్కో డివిజన్‌లో పాతిక సంఖ్యలో అనధికారిక నిర్మాణాలు ఉన్నాయి.

**కట్టడినే మానేశారు**

గత మూడేళ్లుగా భవన నిర్మాణాల విషయంలో అధికార యంత్రాంగం పట్టనట్లుగా ఉంటుంది. టీఎస్‌బీపాస్ విధానం వచ్చినప్పటి నుంచి అనుమతుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించడం, ఫిర్యాదులు వస్తే టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించడం తప్ప.. క్షేత్రస్థాయిలో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? పార్కింగ్, సెట్‌బ్యాక్, సెల్లార్, ఏ అవసరాలకు దీనిని వినియోగిస్తున్నారనే విషయాలను గుర్తించడమే మానేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలను మొదట్లోనే కట్టడి చేయకపోవడంతో ఫిర్యాదులు కూడా అలాగే పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా నగర, పురపాలిక పట్టణ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

అలాంటి ఘటనలు మన వద్ద రాకుండా...గత నెల హైదరాబాద్‌లోని ఓ భవనం కింది అంతస్తులో మంటలు చెలరేగి నాలుగు అంతస్తులకు వ్యాపించాయి. దట్టమైన పొగతో ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ ఘటనలో 9 మంది మృతి చెందారు. భవనం కింది భాగంలో కారు రిపేర్ గ్యారేజ్ ఉండటం, డీజిల్, కెమికల్ డ్రమ్ములు ఉండడంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

# నల్గొండ-ముషంపల్లి రహదారికి రూ.100 కోట్లు

నల్గొండ : సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజే కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ నుంచి ముషంపల్లి వయా ధర్మపురం రహదారి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసే దస్త్రంపై మంత్రిగా తొలి సంతకం చేశారు. త్వరలో ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు పిలుస్తామని వెల్లడించారు. నల్గొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పరిధిలో ఏక వరుసగా ఉన్న ఈ రహదారిపై గడిచిన పదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో దాదాపు 43 మంది మృతి చెందారు. 23 కిలోమీటర్ల నిడివి గల ఈ మార్గంలోని గ్రామాల్లో బత్తాయి తోటలు అధికంగా ఉన్నాయి. ఈ అధ్వాన మార్గంలో రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు ప్రగతికి మార్గాలు..ఎక్కడ రహదారులు బాగుంటే అక్కడ అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. జిల్లా కేంద్రానికి అనుబంధంగా ఉన్న రహదారులను రెండు వరుసలుగా నిర్మాణం చేస్తామని గతంలో కేసీఆర్ సీఎం హోదాలో నల్గొండకు వచ్చిన సందర్భంగా ప్రకటించారు. అయినా అది ఆచరణలోకి రాలేదు.



ప్రస్తుతం గుంతలు పడి, అంచుల వెంట మట్టి కోతకు గురై రాకపోకల కు ఇబ్బంది కలుగుతోంది. ముషంపల్లి వరకు నల్గొండ నియోజకవర్గం కాగా... ధర్మాపురం సాగర్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.

నరకయాతన గుట్టకింది అన్నారం, వెల్గుపల్లి, అన్నారెడ్డిగూడ, రసూల్‌పురం, ముషంపల్లి నుంచి ధర్మాపురం మీదుగా సాగే ఈ రహదారిలో నల్గొండ నుంచి మిర్యాలగూడ, నిడమనూరుకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రైతులు పండించిన ధాన్యం, బత్తాయి రవాణాకు అవస్థలు తప్పడం లేదు. ఏక వరుస, ఇరుకు రహదారితో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు అంచుల వెంట తారు కొట్టుకుపోవడంతో ఎదురుగా వచ్చిన వాహనాలు కిందికి దిగలేక ప్రమాదాలు జరుగుతు న్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ రహదారిని నాలుగు వరుసలుగా చేయడానికి రూ.100 కోట్లు కేటాయించడంపై ఈ మార్గంలోని గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు తమ ఇబ్బంది తొలగించేలా నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

# మొక్కమొక్కకూ లెక్క

పాల్వంచ : పల్లెలతో పాటు పట్టణ ప్రాంతాలనూ పచ్చందాల నెలవులుగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'హరితహారం' కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోంది. ఈ ఏడాది తొమ్మిదో విడత కింద మొక్కలు నాటేందుకు, పంపిణీ చేసేందుకు పురపాలికల వారీగా కార్యాచరణ రూపొందించారు.జియో ట్యాగింగ్ చేయాల్సిందే

కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు పురపాలికల్లో ఈ ఏడాది 5,89,800 మొక్కలు నాటాల్సి ఉంది. నాటిన ప్రతి మొక్కను 'జియో ట్యాంగింగ్' చేయాలని స్థానిక అధికారులకు శాఖాపరమైన ఆదేశాలందాయి. ఇప్పటికే ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. గుంతలు తీసి నాటేందుకు బల్దియా సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. 'దశాబ్ది' పేరిట ప్రతి మున్సిపాలిటీలో 1,000 చొప్పున ఒకేరోజు నాటేలా తాజాగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది నాటిన వాటిల్లో



ఏమైనా చనిపోయినట్లయితే మళ్లీ అక్కడ కొత్తవి వేయనున్నారు. సెప్టెంబరు చివరి నాటికి హరితహారం మొత్తం ప్రక్రియ ముగించాలని కలెక్టర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు. హరితహారం మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక తాజాగా ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఇంటింటికీ మొక్కల పంపిణీ జరుగుతోంది. వర్షాకాలం సీజన్ ముగిసే లోగా లక్ష్యాన్ని పూర్తిచేస్తాం. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతనూ తీసుకుంటున్నాం. స్వామి, పాల్వంచ పుర కమిషనర్

# గిరిజనుల వెతలు పట్టవా..?

జనగామ : జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖకు కనీసం కార్యాలయం లేక వెతలు చెప్పుకునే వేదిక లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలను ఒకే దగ్గర కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలు వారి వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాయి. ఎస్టీ సంక్షేమ శాఖకు కార్యాలయం లేక ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పక్క జిల్లాకు పోవాల్సిందే..

జిల్లా ఏర్పడి ఐదేళ్లయినా ఇక్కడి గిరిజనులకు వెతలు తప్పడం లేదు. గతంలో కార్యాలయం కరవై ఇబ్బందులు పడిన ప్రజలకు..ఇప్పుడు అధికారి కరవయ్యారు. హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారినే ఈ జిల్లాకు కూడా ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. జిల్లా స్థాయి సమావేశాలకు మాత్రమే సదరు అధికారి కలెక్టరేట్‌కు వచ్చి వెళ్తుంటారు. శాశ్వత అధికారి అందుబాటులో లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవాలన్నా, అర్జీ అందించాలన్నా హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. తక్కువ జనాభా కలిగిన మైనారిటీ శాఖకు అధికారి ఉండగా 60 వేల వరకు ఉన్న గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు అధికారి అందుబాటులో లేకపోవడం ఏమిటని పలువురు మండి పడుతున్నారు. ప్రజల వద్దకే పాలన అని పాలకులు చెబుతున్నారే తప్పా గిరిజనుల గోడు వినే నాథుడే కరవయ్యారు.

జూనియర్ అసిస్టెంట్టైనా ఉండాలి

స్థానికంగా గిరిజన అధికారి లేక పోవడం, అవగాహన లేకపోవడం వల్ల ప్రభుత్వం అందించే పథకాలకు ఈ ప్రాంత గిరిజనులు దూరమవుతున్నారు. గిరిజనులకు సంబంధించిన విషయాలపె కలెక్టర్ ప్రకటన రూపంలో తెలియజేస్తున్నా అవి క్షేత్రస్థాయిల తండాల్లోని




ప్రజలకు చేకూరడం లేదు. ఇటీవల బెస్ట్ అవైలబుల్ స్కీం, గిరిజనులకు ఉచిత శిక్షణ, తదితర ప్రకటనలు జారీ చేసినప్పటికీ దరఖాస్తులు సమర్పించేందుకు హనుమకొండలోని గిరిజన కార్యాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. కనీసం ఒక్క జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారినైనా జిల్లా కలెక్టరేట్‌లో నియమిస్తే ఉపయోగంగా ఉంటుందని గిరిజనం కోరుతున్నారు.

గోడు పట్టదా: శంకర్

జిల్లాలో గిరిజన శాఖకు సంబంధించి ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో మా గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా పక్క జిల్లా హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. నిరుపేదలైన గిరిజనులు అంత దూరం వెళ్లాలంటే ప్రయాణపు ఛార్జీలు భారంగా ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అన్ని శాఖలతో పాటు గిరిజన శాఖను కూడా కలెక్టరేట్‌లో కొనసాగించేలా జిల్లా ఉన్నతాధికారులు కృషిచేయాలి.

ఒకరినైనా నియమించాలి–అనీల్ చౌహాన్, సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి

జిల్లాలో అధికారి లేకపోవడంతో విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాల కోసం పొరుగు జిల్లాకు వెళ్లాల్సి వస్తోంది. దరఖాస్తు ప్రక్రియలో ఏ చిన్న తప్పిదం జరిగినా మళ్లీ అంతదూరం వెళ్లక తప్పడం లేదు. స్థానికంగా ఉన్న గిరిజనులకు సంబంధించిన వ్యవహారాలను చూసుకునేందుకు కనీసం జూనియర్ అసిస్టెంట్ స్థాయికి చెందిన అధికారిని నియమిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

# చదువుపై పట్టు... అవసరాలు తీర్చేట్టు




భద్రాచలం : భావి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 'మైండ్ స్పార్క్ ఫ్యూచర్ ఇంజినీర్' కార్యక్రమం అమలుకు ప్రభుత్వం పూనుకుంది. దీనిద్వారా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 10వేల మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. కంప్యూటర్ సాయంతో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరుస్తారు. పోటీ ప్రపంచంలో రాణించేలా ఆలోచన శక్తిని పెంపొందించనున్నారు. చదువులపరంగా నూతన కాంతిని తీసుకురావడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు. మైండ్ స్పార్క్ ఫ్యూచర్ ఇంజినీర్ కార్యక్రమానికి భద్రాద్రి జిల్లాలో 14, ఖమ్మం జిల్లాలో మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో భద్రాద్రి జిల్లాలో రెండు, ఖమ్మం జిల్లాలో ఒక గురుకుల విద్యాలయాలు ఉండగా మిగతావి గిరిజన ఆశ్రమ పాఠశాలలు కావటం విశేషం.

నాలుగు తరగతులకు..

ఆరోతరగతి నుంచి తొమ్మిదోతరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్,సైన్స్‌పై కంప్యూటర్ల సాయంతో నిపుణులు బోధించటం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అమెజాన్ సంస్థ ఇందుకు సహకరిస్తుంది. ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో38, ఏటూరునాగారం– 17, భద్రాచలం– 17, మైదాన ప్రాంతంలో 40 పాఠశాలలు ఎంపికయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 'మైండ్ స్పార్క్' అమలుకానుంది. ఈనెలలోనే బోధన మొదలవుతుంది.

గణితంలో రాటుదేలాలని..

గడిచిన విద్యా సంవత్సరంలో పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఎక్కువ మంది లెక్కల్లో తప్పారు. సిలబస్‌కు మించి ప్రశ్నలు వచ్చాయని, సాధన చేసినవి పరీక్షల్లో రాలేదని ఉపాధ్యాయులు భిన్నవాదనలు వినిపించారు. వీటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. గణితం సబ్జెక్టులో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా విద్యార్థులు సమాధానం రాయగలిగేలా కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు వివరించనున్నారు. గణితం ఉపాధ్యాయులు ఈదిశగా కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఇటీవల ఐటీడీఏలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోజూ వీలైన పీరియడ్‌లో ప్రతి విద్యార్థి.. ల్యాబ్‌లోని కంప్యూటర్‌ను వినియోగించనున్నారు. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక పాస్‌వర్డ్ ఉండటం వల్ల ఎవరు సాధన చేస్తున్నారో అధికారులు సులువుగా తెలుసుకోవచ్చు. ఇంగ్లిష్ మీడియం అమల్లో ఉన్నందున ఆంగ్లంపైనా తర్ఫీదు ఇస్తారు. సైన్స్‌లో వెనుకబడకుండా తీర్చిదిద్దనున్నారు. ఆన్‌లైన్ సదుపాయం ఉండటంతో కొత్త ప్రశ్నలతో పాటు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వనున్నారు.

ఐటీడీఓ పీఓ ప్రత్యేక దృష్టి

పీఓగా ప్రతీక్ జైన్ గతనెలలో బాధ్యతలు స్వీకరించాక గిరిజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉదయం 9.30 గంటల వరకు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు పట్టికలో సంతకం చేయకపోతే కారణాలను అడిగి తెలుసుకుంటున్నారు. గుండాల మండలంలోని ఓ పాఠశాలను పీఓ ఇటీవల పరిశీలించగా.. ఆరోజు సెలవు ఉందని ఉపాధ్యాయులు పనిచేసేచోట లేరు. 17 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. పదోతరగతి వార్షిక పరీక్షల ఫలితాలు తగ్గినచోట్ల 48 మందికి శ్రీముఖాలు ఇచ్చారు. సుమారు 20 మందిని పట్టణ ప్రాంతాల నుంచి మారుమూల పల్లెలకు సాగనంపారు.

# కొంత మంది రైతులకే ఆమోద ముద్ర!




ఖమ్మం : పాడి రైతులకు బ్యాంకుల ద్వారా 'ముద్ర' రుణాలు సకాలంలో అందకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలలుగా ఈ పథకం నత్తనడకగా సాగుతోంది. ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ, డెయిరీకి పాలు పోసే రైతు, ఎస్‌బీఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా మూడు నెలల కిందట పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉభయ జిల్లాల్లో డెయిరీకి పాలుపోసే అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు అతికొద్ది మందికి మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. వందలామంది రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. పాల దిగుబడికి ఇదే మంచి సీజన్. ఈ సమయంలో రుణాలు మంజూరు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.పాల ఉత్పత్తి పెంచేందుకు.. పాల ఉత్పత్తి పెంచేందుకు గేదెల కొనుగోలు కోసం విరివిగా రుణాలు ఇప్పించాలని భావించారు. పాల బిల్లులు డెయిరీ చెల్లిస్తున్నందున బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి ప్రతినెలా ఈఎంఐ చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. గేదెల కొనుగోలుకు రూ.50 వేలు– రూ.10 లక్షల వరకు ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేస్తుంది. ఇప్పటివరకు చూస్తే ఇచ్చిన రుణాలు చాలా తక్కువ. కొంతమందికి చెక్కులు ఇచ్చారు. ఖమ్మం జిల్లాలోని ఒక్క తల్లాడ మండలంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో మాత్రమే మంజూరు చేశారు.

రుణాలను సకాలంలో పాడి రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నాం. దరఖాస్తుదారుల్లో కొంతమంది డిఫాల్టర్లు ఉండటం, మరికొందరికి ఇతర ధ్రువపత్రాలు లేకపోవటం వల్ల బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. అర్హులైన వారికి మాత్రం అవకాశం కల్పించేందుకు బ్యాంకు అధికారులతో మాట్లాడతాం. డాక్టర్ ఎ.కుమారస్వామి, ఉప సంచాలకుడు, విజయ డెయిరీ

# అంతిమ సంస్కారానికి అంతులేని కష్టాలు



కరీమాబాద్ : శ్మశానవాటికలను స్మృతివనాలుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. సీఎం ప్రత్యేక నిధులు రూ.కోటి మంజూరైనా ఆ శ్మశానవాటికకు మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తోంది. వరంగల్ నగరంలోని 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట కరీమాబాద్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న శాంతినగర్ శ్మశానవాటికలో ఏళ్ల తరబడి మౌలిక సదుపాయాలు లేవు. ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నా.. కనీసం రోడ్డు కూడా సరిగాలేదు. శ్మశానవాటిక ప్రధాన గేటు నుంచి లోపలి వరకు దారంతా మురుగు నీరు నిలిచి ఉంది. కీర్తి బార్ నుంచి వచ్చే మురుగు నీరు శ్మశానవాటిలోకి రాకుండా నివారించడంలో బల్దియా అధికారులు విఫలమవుతున్నారు. దీంతో శాంతినగర్, పెరుకవాడ, రైల్వేగేటు, ఎస్ఆర్ఆర్‌తోట, సాకరాశికుంట తదితర ప్రాంతాల్లో ఎవరైనా మరణిస్తే ఈ శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. పార్థివ దేహాలను దుర్గంధం వెదజల్లుతున్న మురుగు నీటిలో నుంచే తీసుకెళ్తున్నారు. నగర నడిబొడ్డున ఉన్న శ్మశానవాటికను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి నిధులొస్తే రూ.30 లక్షల పనులే..

శాంతినగర్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి 2017లో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయించారు. అయితే అందులో కేవలం రూ.30 లక్షలతో ప్రహరీ, నాలుగు బర్నింగ్ ప్లాట్ఫాంలు నిర్మించారు. ఇంకా సీసీరోడ్డు నిర్మాణం, కమ్యూనిటీ హాల్, షెడ్డు, పార్కు ఏర్పాటు పనులు గుత్తేదారు వదిలేశారు. దీంతో మిగిలిన రూ.70 లక్షల నిధులు వెనక్కి వెళ్లాయి. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో శ్మశాన వాటిక పరిస్థితి అధ్వానంగా మారింది.

ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు– ముత్తినేని శ్రీనివాస్, పెరుకవాడ శ్మశానవాటికలోకి మురుగు వస్తుండటంతో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిధులున్నా పనులు చేయకపోవడం సరికాదు. ప్రధాన గేటు వద్ద మురుగు నీరు రాకుండా అరికట్టాలి. దారికి ఇరువైపులా పెరిగిన చెట్లు కొట్టించి, రాత్రివేళ దీపాలు వెలిగేలా ఏర్పాటు చేయాలి. పాలకులు స్పందించి వెనక్కి పోయిన నిధులు తెప్పించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

# వంటలెలా ఉంటున్నాయి..!

జనగామ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఆహారం శుచి, శుభ్రతగా ఉండేలా జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించారు. వానాకాలంలో అనారోగ్య సమస్యలు ఎదురవకుండా వంటల తయారీలో జాగ్రత్త వహించేలా చూస్తున్నారు. ఏం వండిపెడ్తున్నారు.. ఎలా వండుతున్నారు.. తదితర వివరాలు సేకరణకు అప్పటికప్పుడు ఫొటోలు తీసి పంపాలని ఆదేశించారు. గత ఏడాది పలు చోట్ల కలుషితాహారం తిని బాలికలు అనారోగ్యం బారిన పడడం, వైద్యశాలల్లో చేరడం వంటి అంశాలను గమనంలోకి తీసుకున్న అధికారులు ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఉదయం జావ అందించడం నుంచి రాత్రి భోజనం వరకు ఆహార పదార్థాల తయారీని పరిశీలించడానికి రోజూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లోని ఏఎన్ఎంలకు ఈ బాధ్యత అప్పగించారు. వీరు కచ్చితంగా నిత్యం వంట వడ్డన సహా విద్యార్థులు భోజనం చేస్తున్న విషయాలను ప్రతిరోజూ ఫొటోలు తీసి సమర్పిస్తున్నారు. ఇంకా వంటగది శుభ్రత, వంట వండే మహిళలు ప్రత్యేక దుస్తులు ధరించడం, మాస్క్ ధరించడం



తదితరం అమలుపరుస్తున్నారా లేదా అని గమనించేందుకు కూడా ఈ చిత్రాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. అవగాహన సదస్సులను కూడా అధికారులు నిర్వహించి భోజనమాతలకు దిశానిర్దేశం చేసారు. జిల్లాలో 11 కేజీబీవీల్లో ఏ యన్ యంలున్నారు.

పాలనాధికారి ఆదేశాలు పాటిస్తున్నాం

–గౌసియా బేగం, బాలికావిద్య ప్రత్యేకాధికారిణి, జనగామ

జిల్లాలోని 11 మంది ఏఎన్ఎంలు కేజీబీవీల్లో ఉన్నారు. వీరు సహా వంట వండేవారికి జిల్లా యంత్రాంగం రుచి శుచి శుభ్రత గురించి గత ఏడాది శిక్షణ ఇచ్చారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు బాధ్యులు నిత్యం ఫొటోలు తీసి పంపిస్తున్నారు. విద్యాశాఖ అధికారి కూడా నిత్యం విద్యాలయాలను సందర్శించి వంటలను పరిశీలించి తగు సూచనలిస్తున్నారు. ఏఎన్ఎంలు లేని కేజీబీవీల్లో ఇతర ఉద్యోగులకు బాధ్యత అప్పగిచాం. నాణ్యత లేని కూరగాయలు వాడకం పూర్తిగా నిలిచిపోయింది.

# సమస్యలతో సతమతం

ములుగు : 22వ డివిజన్ పరిధిలోని బ్యాంక్‌కాలనీ, శాంతినగర్, వాసవీ కాలనీల్లో సమస్యలతో స్థానికులు సతమతం అవుతున్నారు. రాజకీయ నేతలు, బడా వ్యాపారులు, సీఏలు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర రంగాల ప్రముఖులు ఉన్నా సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. గత నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు బ్యాంక్ కాలనీకి వరద ముప్పు తప్పలేదు. అటు దేశాయిపేట రోడ్డు, ఇటు 80 అడుగుల రహదారిలో రాకపోకలు నిలిచాయి. భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు



కోరుతున్నారు. ఈ కాలనీల్లో భూ వివాదాలు కూడా పరిష్కారం కావడం లేదు. రెండ్రోజుల కిందట శాంతినగర్‌లో ఒకరు చేపట్టిన ప్రహరీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. తన స్థలంలో ప్రహరీ నిర్మించుకుంటున్నానని ఒకరంటే.. అది రోడ్డు స్థలమని కాలనీ వాసులు అభ్యంతరం చెబుతున్నారు. కొన్ని వీధుల్లో డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా శుభ్రం చేయడం లేదు.నిధులు విడుదల చేయాలి–బస్వరాజు కుమార్, కార్పొరేటర్

సమస్యలు ఉన్నది వాస్తవమే. అభివృద్ధి పనుల కోసం చాలా వరకు ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే తప్ప పనులు చేపట్టడానికి వీలుకాదు. ప్రాధాన్యతా క్రమంలో ఒక్కో పని చేసుకుంటూ పోతున్నాం.

# కాలువ ఇలా... సాగునీరు పారేదెలా

రోళ్లవాగు ప్రధాన కాలువ ద్వారా సాగు నీరందించే కాలువల షెట్టర్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఈ కారణంగా చివరి గ్రామాలకు సాగు నీరందించడం గగనంగా మారుతోంది. ఎస్సారెస్పీ కాలువల చివరి భూములకు నీరందించాల్సిన సమయంలో కాలువల షెట్టర్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఉప కాలువల నిర్వహణ పట్టించుకో




కపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. రోళ్లవాగు 4ఎల్ కాలువ చాలా చోట్ల దెబ్బతింది. కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. బీర్‌పూర్, తీగలధర్మారం, మగ్గిడి ద్వారా దొంతాపూర్, ఎడపెల్లికి కాలువ ద్వారా 400 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కాలువల షెట్టర్లకు మరమ్మతులు చేసి పొదలను తొలగించి నీరు సక్రమంగా పారేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.



# ఏపీ ప్రభుత్వం క్లియరెన్స్ సేల్ మొదలుపెట్టింది

మంగళగిరి: గత మంత్రివర్గ సమావేశంలో అనేక కంపెనీలకు విచిత్రమైన స్పెషల్ ప్యాకేజీలు ఇచ్చారని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయా పరిశ్రమలకు భూ కేటాయింపులు విచిత్రంగా జరిగాయని ఆరోపించారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాదెండ్ల మాట్లాడారు. “రిటైల్ స్టోర్ మూసివేసే ముందు క్లియరెన్స్ సేల్ పెడతారు. వాళ్లు 70, 80 శాతం అని చెబుతుంటారు. ఉన్నవన్నీ అమ్మేసి దుకాణం మూసేస్తున్నామని మార్కెటింగ్ చేస్తుంటారు. అలాగే ఏపీ ప్రభుత్వం కూడా క్లియరెన్స్ సేల్ మొదలుపెట్టింది. గతంలో కొన్ని కంపెనీలకు భూములు కేటాయిస్తే వాళ్లు ఏర్పాటు చేయలేమంటూ రద్దు చేసుకున్నారు. ఆ కంపెనీలకే మళ్లీ ఇప్పుడు భూములు కేటాయిస్తున్నారు” అని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

# మోదీ సమక్షంలో.. మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్ ప్రమాణం



భోపాల్: మధ్యప్రదేశ్‌లో భాజపా సర్కారు కొలువుతీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా దక్షిణ ఉజ్జయిని ఎమ్మెల్యే, ఓబీసీ నేత మోహన్ యాదవ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. భోపాల్‌లోని లాల్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుబాయి పటేల్.. యాదవ్‌తో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణస్వీకార వేడుకకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోహన్ యాదవ్ ప్రమాణం అనంతరం.. రాజేంద్ర శుక్లా, జగదీశ్ దేవ్‌రా ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియా, భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్య నాథ్, పుష్కర్ సింగ్ ధామి, ఏక్‌నాథ్ శిందే, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహన్ తదితరులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్‌ను ఎంపిక చేస్తూ ఇటీవల అధిష్ఠానం అనూహ్య నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సీఎం రేసులో పలువురు రాష్ట్ర అగ్ర నేతల పేర్లు వినిపించినా.. కొత్త ముఖానికే పగ్గాలు అప్పగించాలని హైకమాండ్ నిర్ణయించింది. ఉజ్జయినిలో విద్యార్థి సంఘ నేతగా 1982లో ఎన్నికైన మోహన్ యాదవ్.. 2013లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 2018 ఎన్నికల్లో నెగ్గి, మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కాంగ్రెస్ సర్కారు కూలిపోయి, భాజపా తిరిగి వచ్చాక 2020లో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆరెస్సెస్‌తో సత్సంబంధాలున్న ఆయన హిందుత్వ వాది. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అఖండ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కమలం పార్టీ 163 స్థానాలు దక్కించుకోగా.. కాంగ్రెస్ 66 స్థానాలకు పరిమితమైంది.




# టెండర్లు ఫైనలైజ్ చేసినా నిధులు విడుదల చెయ్యొద్దు..

అమరావతి: టీటీడీ నిధులు తిరుపతి మున్సిపల్ కార్పోరేషన్‌కు కేటాయించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నిధుల విడుదల నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది.

తిరుపతి పరిశుభ్రత, తిరుపతి రహదారుల నిర్వహణ కోసం కార్పోరేషన్ నాలుగు టెండర్లు పిలిచింది. దీన్ని సవాలు చేస్తూ బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ రోజు హైకోర్టులో పిల్ విచారణకు వచ్చింది. న్యాయవాది ఎలమంజుల బాలాజీ పిల్‌పై వాదనలు వినిపించారు. టీటీడీ నుంచి నిధుల విడుదల అనేది దేవాదాయ చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని బాలాజీ వాదించారు.

టీటీడీ నిధులు భక్తుల సౌకర్యాలు, తిరుమల అభివృద్ధి కోసమే వినియోగించాలని కోరారు. పిటిషనర్ బాలాజీ వాదనలు పరిగణలోనికి హైకోర్టు తీసుకుంది. టెండర్లు ఫైనలైజ్ చేసినా నిధులు విడుదల చెయ్యొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. టీటీడీ, ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.



# అంగన్‌వాడీలపై కక్ష కట్టిన జగన్ రెడ్డి

అమరావతి: అంగన్‌వాడీలపై ఏపీ సీఎం జగన్ రెడ్డి కక్ష కట్టారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుండా నిర్బంధాలు, అక్రమ అరెస్టులకు పాల్పడ్డారన్నారు. తెలంగాణతో సమానంగా జీతాలు పెంచకపోగా ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. అంగన్‌వాడీలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. అంగన్‌వాడీల న్యాయ పోరాటానికి టీడీపీ సంపూర్ణ మద్దతు పలుకుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

# పార్లమెంటును ఎవరూ అడ్డుకోలేరు.. దాడి ఘటనపై స్పీకర్ తొలిసారి స్పందన

న్యూఢిల్లీ: పార్లమెంటులో భద్రతా వైఫల్యం తీవ్ర కలకలం సృష్టించడం, ఒక వ్యక్తి పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకడం, మరో వ్యక్తి గ్యాలరీ నుంచి ఒక రకమైన పొగను వదిలి భయభ్రాంతులకు గురిచేయడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలిసారి స్పందించారు. సభా కార్యక్రమాలు జరక్కుండా ఎవ్వరూ ఆపలేరని పార్లమెంటు సభ్యులకు హామీ ఇచ్చారు. భద్రతా వైఫల్యంపై స్పీకర్ మాట్లాడుతూ... ”సభ జీరో అవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై లోక్‌సభ, ఢిల్లీ పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే, అందరినీ భయభ్రాంతులకు గురిచేసిన పొగ వల్ల ఎలాంటి ఆందోళన అవసరం లేదని ప్రాథమిక విచారణలో గుర్తించాం” అని ఓంబిర్లా చెప్పారు. దాడికి దిగిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి వద్దనున్న వస్తువులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పార్లమెంటు వెలుపల సిద్ధంగా ఉన్న ఇద్దరు అనుమానితులను కూడా అరెస్టు



చేసినట్టు చెప్పారు. కాగా, జోరో అవర్ జరుతుండగా, ఒక అజ్ఞాత వ్యక్తి ఒక బెంచీ నుంచి మరో బెంచ్ వైపు గొంతుకుంటూ వెళ్లాడని, మరో వ్యక్తి ఒకరరకమైన టియర్ గ్యాస్ వదులుగా భయభ్రాంతులకు గురిచేశాడని కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి తెలిపారు.




అమరావతి: 2023కు బైబై చెప్పే రోజులు దగ్గరపడుతున్నాయి. మరికొన్ని రోజుల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకనున్నాము. ఈ క్రమంలో 2024లో వచ్చే సెలవులకు సంబంధించిన ప్రకటనను ఏపీ సర్కార్ విడుదల చేసింది. 2024 క్యాలెండర్ ఇయర్‌కు సాధారణ సెలవులను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొత్తం 27 సాధారణ సెలవులతో పాటు, 25 ఐచ్ఛిక సెలవులుగా సూచిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**సాధారణ సెలవులు ఇవే..** జనవరి 1 న్యూఇయర్ (సోమవారం), జనవరి 14 భోగి (ఆదివారం), జనవరి 15 సంక్రాంతి (సోమవారం), జనవరి 26 రిపబ్లిక్ డే(శుక్రవారం), మార్చ్ 8 మహాశివరాత్రి (శుక్రవారం), మార్చ్ 25 హెూళి (సోమవారం), మార్చ్ 29 గుడ్ ఫ్రైడే (శుక్రవారం), ఏప్రిల్ 5 బాబు జగ్జీవన్ రామ్ జయంతి (శుక్రవారం), ఏప్రిల్ 9 ఉగాది (మంగళవారం), ఏప్రిల్ 11 ఈదుల్ ఫితర్ (రంజాన్)(గురువారం), ఏప్రిల్ 12 రంజాన్ మాసం (శుక్రవారం), ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి (ఆదివారం), ఏప్రిల్ 17 శ్రీరామనవమి (బుధవారం), జూన్ 17 ఈదుల్ అజహా (బక్రీద్) (సోమవారం), జూలై 17 మొహర్రం (బుధవారం), జూలై 27 బోనాలు (సోమవారం), ఆగష్టు 15 స్వాంతంత్ర్యదినోత్సవం (గురువారం), ఆగష్టు 28 శ్రీకృష్ణాష్టమి (సోమవారం), సెప్టెంబర్ 7 వినాయకచవితి (శనివారం), సెప్టెంబర్ 16 ఈద్ మిలానుదీన్‌నబీ (సోమవారం), అక్టోబర్ 2 మహాత్మాగాంధీ జయంతి (బుధవారం), అక్టోబర్ 12 విజయదశమి (శనివారం), అక్టోబర్ 13 విజయదశమి పర్వదినాలు (ఆదివారం), అక్టోబర్ 30 దీపావళి (బుధవారం), సెప్టెంబర్ 15 కార్తీక పౌర్ణమి/గురునానక్ జయంతి (శుక్రవారం), డిసెంబర్ 25 క్రిస్మస్ (బుధవారం), డిసెంబర్ 26 క్రిస్మస్ పర్వదినాలు (గురువారం).

**ఐచ్ఛిక సెలవులు :** జనవరి 16 కనుమ (మంగళవారం), జనవరి 25 హజరత్ అలీ జయంతి (గురువారం), ఫిబ్రవరి 2 షాబ్ ఈ మిరాజ్ (గురువారం), ఫిబ్రవరి 14 శ్రీ పంచమి (బుధవారం), ఫిబ్రవరి 26 షాబ్ ఈ బారాత్ (సోమవారం), మార్చ్ 31 షహదత్ హజత్ అలీ (ఆదివారం), ఏప్రిల్ 5 జుమాతుల్ వాడా (శుక్రవారం), ఏప్రిల్ 7 షాబ్ ఈ ఖాదీర్ (ఆదివారం), ఏప్రిల్ 14 తమిళ్ న్యూ ఇయర్ డే (ఆదివారం), ఏప్రిల్ 21 మహవీర్ జయంతి (ఆదివారం), మే 10 బసవ జయంతి (శుక్రవారం), మే 23 బుద్ధ పౌర్ణమి (గురువారం), జూన్ 25 ఈద్ ఇ గాధీర్ (మంగళవారం), జూలై 7 రథయాత్ర (ఆదివారం), జూలైల 16 9వ మొహర్రం(మంగళవారం), ఆగష్టు 15 పార్సీ న్యూఇయర్ డే (గురువారం), ఆగష్టు 16 వరలక్ష్మీ వ్రతం (శుక్రవారం), ఆగష్టు 19 శ్రావణ పౌర్ణిమ/రాఖీ పౌర్ణమి (సోమవారం), ఆగష్టు 26 అర్బయీన్ (సోమవారం), సెప్టెంబర్ 10 దుర్గాష్టమి (గురువారం), సెప్టెంబర్ 11 మహర్నవమి (శుక్రవారం), సెప్టెంబర్ 15 యాజ్ దహుమ్ షరీఫ్ (మంగళవారం), సెప్టెంబర్ 30 నరకచతుర్ధి (బుధవారం), నవంబర్ 11 హజత్ సయ్యద్ మహ్మద్ జువన్ పురి మహదీ(శనివారం), డిసెంబర్ 24 క్రిస్మస్ ఈవ్ (మంగళవారం).




# గాజా సొరంగాల్లోకి సముద్రపు నీరు..!

హమాస్ దళాలను గాజా సొరంగాల్లోనే జలసమాధి చేసే వ్యూహాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అమలు చేయడం మొదలుపెట్టింది. దీనిలో భాగంగా గాజా మెట్రోగా పిలిచే హమాస్ సొరంగాల్లోకి సముద్రపు నీటి విడుదలను మొదలుపెట్టింది. ఈ ప్లాన్ తొలి దశలోనే ఉందని అమెరికా వర్గాలు పేర్కొన్నాయి. వీటిల్లో నీరు నింపే ప్రణాళిక పూర్తికావడానికి కొన్ని వారాల సమయం పడుతుందని అంచనావేస్తున్నారు. ఈ దెబ్బకు హమాస్ దళాలు నక్కిన ఛాంబర్లు, బందీలను దాచిన ప్రదేశాలు, ఆయుధాగారాలు పూర్తిగా ధ్వంసమైపోతాయని భావిస్తున్నారు. కాకపోతే గాజాలోకి వచ్చి చేరే సముద్రపు నీరు కారణంగా ఇక్కడి మంచి నీటి వనరులు దెబ్బతింటాయనే ఆందోళనలు ఉన్నాయి. ఇజ్రాయెల్ దళాలు ఈ సొరంగాలను దెబ్బతీయడానికి భారీగా బంకర్ విధ్వంసక బాంబుల వినియోగం, రసాయన ద్రవాల వినియోగం, శునకాలను, రోబోలను, డ్రోన్లను పంపడం వంటి అప్షన్లను పరిశీలించాయి. తాజాగా ఐడీఎఫ్ చీఫ్ హెర్జి హల్వీ మాట్లాడుతూ సొరంగాలను నీటితో నింపడం మంచి వ్యూహం అని వ్యాఖ్యానించారు. అంతకు మించి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఇప్పటికే ఐదు భారీ పంపులను గాజా వద్దకు తరలించినట్లు కథనాలొచ్చాయి. మరోవైపు ఈ వ్యూహంపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్పందిస్తూ “ఆ సొరంగాల్లో బందీలెవరూ లేరనే వాదనలు ఉన్నాయి. కానీ, నేను దానిని ధ్రువీకరించలేను. ప్రతి పౌరుడి మరణం విషాదకరమే. ఇజ్రాయెల్ మాటలకు చేతలకు పొంతన ఉండాలని కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు.

**2015లో ఈజిప్ట్ కూడా ఇలానే..** గాజా నుంచి ఈజిప్ట్‌లోకి సొరంగాలు తవ్వడం ఇక్కడి వ్యాపారులకు పరిపాటి. 2015లో గాజాపట్టీ–సినాయ్ ద్వీపకల్పం మధ్య సొరంగాలను ధ్వంసం చేసేందుకు ఈజిప్ట్ సైన్యం మధ్యధరా సముద్రం నీటిని వీటిల్లోకి వదిలింది. గాజా సరిహద్దుల్లోని సుమారు 14 కిలోమీటర్ల మేర భారీ పైపులతో నీటిని పంప్ చేశారు. ఆ తర్వాత ఈ సముద్ర నీటిని చేపల పెంపకానికి వాడారు. ఈ చర్యను అప్పట్లో చాలా పాలస్తీనా గ్రూపులు తీవ్రంగా ఖండించాయి. కానీ, ఆ ప్రాంతంలోని నేల దెబ్బతిందన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ చర్య లక్షల మంది పాలస్తీనా వాసుల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు 2016లో ఓ నివేదిక పేర్కొంది. తాము ఇజ్రాయెల్ అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి అప్పట్లో తెలిపారు.




ఢిల్లీ: దేశంలో ఇటీవల కలకలం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ యజమానుల్లో ఒకరైన రవి ఉప్పల్‌ను దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈడీ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా అతడిని దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారిక వర్గాలు బుధవారం వెల్లడించాయి.

రవి ఉప్పల్‌ను గత వారమే అదుపులోకి తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. అతడిని భారత్‌కు తీసుకొచ్చేందుకు దుబాయి అధికారులతో ఈడీ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపాయి. ఇక మరో యజమాని సౌరభ్ చంద్రఖర్ కోసం కూడా దుబాయ్ పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

**ఏంటీ బెట్టింగ్ యాప్ వ్యవహారం..** ఛత్తీస్‌గఢ్‌లోని భిలాల్ ప్రాంతానికి చెందిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రఖర్ దుబాయ్ కేంద్రంగా భారత్‌లో మహదేవ్ బెట్టింగ్ యాప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. అయితే, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ముసుగులో వీరు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న కోల్‌కతా, భోపాల్, ముంబయి వంటి తదితర నగరాల్లో సోదాలు నిర్వహించగా.. రూ. వందల కోట్లలో అక్రమ నగదు బయటపడింది. బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించేందుకు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. రవి ఉప్పల్‌కు వనౌటు దేశ పాస్‌పోర్ట్ ఉందని, దాన్ని ఉపయోగించి అతడు పలు దేశాల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని దర్యాప్తులో తేలినట్లు ఈడీ పేర్కొంది. అయితే, అతడు భారత పౌరసత్వాన్ని వదులుకోలేదని, దీనిపైనే ఆస్ట్రేలియా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. ఇక, ఈ యాప్ మరో ప్రమోటర్ అయిన సౌరభ్ చంద్రశేఖర్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఈఏలో ఘనంగా జరిగింది. ఇందుకు రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు ఈడీ గుర్తించింది. అతడి పెళ్లికి బాలీవుడ్‌లోని ప్రముఖ సెలబ్రిటీలు కూడా హాజరైనట్లు ఈడీ తమ ఛార్జ్‌షీట్‌లో వెల్లడించింది. ఈ కేసులో రవి ఉప్పల్, సౌరభ్ చంద్రఖర్‌పై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఆ తర్వాత ఈడీ అభ్యర్థన మేరకు వీరిద్దరిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. అయితే, ఈ మనీలాండరింగ్ ఆరోపణలను రవి ఉప్పల్, సౌరభ్ చంద్రఖర్ ఖండించారు. మహదేవ్ యాప్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాన్ని శుభమ్ సోని అనే వ్యక్తి నడిపిస్తున్నాడని చెప్పారు. మరోవైపు, ఈ బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పైనా ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్ ప్రమోటర్లు బఘేల్‌కు రూ.508 కోట్లు చెల్లించినట్లు క్యాష్ కొరియర్ ఆసిమ్ దాస్ తన వాంగ్మూలంలో చెప్పాడని ఈడీ ఆరోపించింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆసిమ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆ డబ్బును తనకు శుభమ్ సోని ఇచ్చాడని ఆసిమ్ చెప్పినట్లు ఈడీ వెల్లడించింది. కాగా.. ఆ తర్వాత అతడు మాట మార్చినట్లు సమాచారం. అధికారులు తమతో బలవంతంగా ఆ వాంగ్మూలంపై సంతకం చేయించినట్లు ఆసిమ్ ఆ మధ్య జైలు అధికారికి లేఖ రాసినట్లు వార్తలు వచ్చాయి.

## తమన్నా లో ఛెంజెస్ తట్టుకోలేకపోతున్న ఫ్యాన్స్!

మిల్కీబ్యూటీ తమన్నా కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. పెళ్లి చేసుకోకుండానే సొగసరి సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టేసి తగ్గేదేలే అంటుంది. ఐటం పాటలతో..గెస్ట్ రోల్స్ తో అదరగొ డుతుంది. ఏదైనా సినిమా నే కాదా? అందులో కనిపించనా లేదా? అన్న కోణంలో తమన్నా సినిమాలు చేసుకుంటూ వెళ్లిపోతుంది. ఈ క్రమంలో కెరీర్ లో ఎక్కడా గ్యాప్ లు కనిపించలేదు. ఇంకా చెప్పాలంటే మునుపటి కంటే ఇంకా బిజీ అయిందనిపిస్తుంది. హీరోయిన్ గా రాణించినంత కాలం కేవలం ఆతరహా పాత్రల్లోనే కనిపించింది. కానీ ఇప్పుడన్నీ రకాల పాత్రల్ని కలిపి చేసేస్తోంది. హీరోయిన్ ఛాన్స్ వస్తే హీరోయిన్ అయిపోతుంది. ఐటం గాళ్ల్ ఛాన్స్



వస్తే నర్తకిగా మారిపోతుంది. ఆ రెండు గాక గెస్ట్ రోల్స్ వచ్చినా నాకేం అభ్యంతరం లేదంటూ దూసుకుపోతుంది. ఇలా వృత్తి పరంగా తమన్నా స్పీడ్ ఏ మాత్రం తగ్గలేదు. అలాగే వ్యక్తిగత జీవితంలో ప్రేమ పాఠాల్లోనూ అంతే బిజీగా ఉంది. అలాగని ప్రొపెషనల్ కెరీర్ ని అశ్రద్ధ చేయలేదు. రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతోంది. అయితే మిల్కీబ్యూటీ రూపంలో మాత్రం కొన్ని రకాల మార్పులు కొట్టొచ్చాయి. రూప లావణ్యంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. తాజాగా అమ్మడు మరో కొత్త ఫోటోని షేర్ చేసింది. అందులో తమన్నా మెరుపులు ఏమాత్రం తగ్గలేదు.

కానీ తమన్నాని తదేకంగా పరిశీలిస్తే మాత్రం బ్యూటీలో మార్పులు కనిపిస్తున్నాయి. ఇక తమన్నా భంగిమ మాత్రం వావ్ అనిపిస్తుంది. అమ్మడు ముస్తాబైన విధానం.. పెద్దాలకు అద్దిన ఎర్రటి లిప్ స్టిక్..యాక్సరసీస్ ప్రతీది తమన్నాని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. మిల్కీ అందానికి ఫ్యాన్స్ అంతా ఫిదా అవుతున్నారు.

## నేషనల్ క్రష్ బ్యూటీకి టాప్ లీగ్ లో కుర్చీ!

రష్మిక మందన్న అలియాస్ గీతాంజలికి అప్పుడే బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ జాబితాలో చేర్చుతున్నారా? ఒక్క బాలీవుడ్ హిట్ అమ్మడి రేంజ్ ని మార్చేసిందా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. ఇటీవలే రిలీజ్ అయిన యానిమల్ లో రష్మిక పెర్ఫార్మెన్స్ ఏ రేంజ్ లోఉందో తెలిసిందే. రణబీర్ కపూర్ భార్య పాత్రలో అమ్మడి అభినయంతో అదరగొట్టేసింది. తెరపై కనిపించినంతసేపు తదనైన మార్క్ పెర్ఫార్మె న్స్ తో ఆకట్టుకుంది. రష్మిక పాత్ర ఇంకా బలంగా ఉంటే బాగుండనిపించింది. ఓవైపు రణబీర్..మరోవైపు అనీల్ కపూర్ పాత్రలు ధీటుగా సాగుతోన్న సమయంలో రష్మిక రోల్ ఆడియన్స్ ని రొమాంటిక్ మోడ్ లోకి తీసుకెళ్లేది. రష్మిక పాత్ర సక్సస్ అవ్వడానికి ఈ లాజిక్ కారణమైంది. కానీ ఇంకా ఇంటెన్స్ తో ఆ రోల్ చూపిస్తే ఉంటే బాగుండు అనిపించింది. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ వసూళ్లు గురించి చెప్పాల్సిన



పనిలేదు. ఇప్పటికే 500 కోట్లకు పైగా రాబట్టింది. 1000 కోట్ల దిశగా అడుగులు వేస్తోంది. ఇక ఈ సినిమాకంటే ముందు రష్మిక పుష్పతో పాన్ ఇండియాలోనే ఫేమస్ అయింది. ఆ సినిమా కూడా నార్త్ బెల్ట్ లో భారీ వసూళ్లు సాధించింది. శ్రీవల్లి పాత్ర హిందీ ఆడియన్స్ ని ఎంతగానో మెప్పించింది. ఓ తెలుగు సినిమా హీరోయిన్ రోల్ ఇంతలా కనెక్ట్ అవ్వడం అన్నది అదే తొలిసారి. పుష్ప తర్వాత యానిమల్ కంటే ముందు రష్మిక కొన్ని హిందీ సినిమాలు చేసింది. కానీ అవి పెద్దగా సక్సెస్ కాలేదు. ఆవేవి రష్మిక ఇమేజ్ ని దెబ్బ తీయలేదు. తాజాగా యానిమల్ సక్సెస్ నేపథ్యం.. రష్మికకి కొత్తగా వస్తోన్న హిందీ అవకాశాల నేపథ్యంలో బాలీవుడ్ స్టార్ లీగ్ కి అన్ని రకాలుగా అర్హురాలే అన్న ప్రచారం సాగుతోంది. రష్మికకి ..దీపికా పదుకొణే..అలియాభట్ సరసన స్థానం ఇవ్వొచ్చు అన్న వార్తలు ఒక్కసారిగా ఊపందుకుంటున్నాయి. ఇన్ స్టా గ్రామ్ లో అమ్మడి ఫాలోయింగ్...బాలీవుడ్ నటీమణులకు ఏమాత్రం తగ్గకుండా అమ్మడి ఫిట్ నెస్ ఫ్రీక్ వీడియోలు ప్రతీదిరష్మిక రేంజ్ ని పెంచుతున్నవే.




## విరుష్క జోడీ వార్షికోత్సవం ఇలా..



టీం ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ వివాహ బంధంలో అడుగు పెట్టి అప్పుడే ఆరు ఏళ్లు అవుతోంది. తాజాగా వీరు ఆరవ వార్షికోత్సవం స్నేహితులు మరియు సన్నిహితుల సమక్షంలో వైభవంగా జరుపుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డిసెంబర్ 11న విరుష్క జోడీ వివాహం వార్షికోత్సవం జరుపుకున్న నేపథ్యం లో సోషల్ మీడియాలో వీరి జోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ లక్షల కొద్ది మెసేజ్ లు అందాయి. ఇక బాలీవుడ్ ప్రముఖులతో పాటు ప్రముఖ క్రీడాకారులు కూడా విరుష్క జోడీకి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా వార్తల్లో నిలిచారు. సన్నిహితులు మరియు బంధువుల సమక్షంలో విరుష్క జోడీ కేక్ కట్ చేసి తమ వార్షికోత్సవంను జరుపుకున్నారు. ప్రస్తుతం కోహ్లీ, అనుష్క వార్షికోత్సవ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. వీరి వైవాహిక జీవితం ఎప్పటికీ ఇంతే సంతోషంగా, ఆనందంగా ఉండాలని అభిమానులు కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. విరాట్ కోహ్లీ, అనుష్క లకు 2021 జనవరి 11న కుమార్తె జన్మించింది. ఆ పాపకి వామిక అనే పేరు పెట్టడం జరిగింది. మొత్తానికి ఎప్పటికప్పుడు విరుష్క జోడీ మరియు వామిక గురించి సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా ఈ వార్షికోత్సవ ఫోటోలతో విరుష్క దంపతులు వైరల్ అవుతున్నారు.

## 2024లోనే మన స్టార్ హీరోల మెరుపులు




2023 ముగుస్తోంది.. తదుపరి 2024లో అడుగుపెడుతున్నాం. డిసెంబర్ 31 మిడ్ నైట్ సెలబ్రేషన్స్ కోసం ప్రపంచం ఎంతో ఆసక్తిగా వేచి చూస్తోంది. ఇలాంటి తరుణంలో ఈ ఏడాది ఒక్కటంటే ఒక్క సినిమాలో కూడా నటించకుండా, బొత్తిగా నల్లపూసలైపోయిన హీరోలు ఎవరెవరు? అన్నది ఆరా తీస్తే టాలీవుడ్ నుంచి పలువురు కనిపించారు. విక్టరీ వెంకటేష్ , నాగార్జున, మహేష్ బాబు, రామ్ చరణ్, ఎన్టీఆర్ అల్లు అర్జున్ వీళ్లు నటించిన సినిమాలేవీ రాలేదు. అయితే వెంకీ ఇప్పుడు కెరీర్ 75వ సినిమా సైంధవ్ లో నటిస్తూ బిజీగా ఉన్నాడు. ఈ ల్యాండ్ మార్క్ మూవీతో ఎట్టి పరిస్థితిలో హిట్ కొట్టాలని కసిగా పని చేస్తున్నాడు. ఇది వచ్చే ఏడాది ఆరంభంలో విడుదలవుతుంది. మరోవైపు నాగార్జున నా సామిరంగా చిత్రంతో బిజీగా ఉన్నారు. అటు రామ్ చరణ్ ఆర్.ఆర్.ఆర్ తర్వాత శంకర్ తో గేమ్ ఛేంజర్ మూవీలో నటిస్తూ బిజీగా అయ్యారు. గేమ్ చేంజర్ వచ్చే ఏడాది చివరిలో విడుదలవుతుంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో దేవర చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా కేటగిరీలో నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో మొదటి భాగం వచ్చే ఏడాది విడుదలవుతుంది. అల్లు అర్జున్ పుష్ప బ్లాక్ బస్టర్ విజయం సాధించడంతో పుష్ప 2పైనే పూర్తిగా ఫోకస్ పెట్టారు. పుష్ప 2తో భారీ పాన్ ఇండియా హిట్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ఈ చిత్రానికి సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.

వచ్చే ఏడాది ఆరంభంలో వెంకీ, మహేష్ నటించిన సినిమాలు రానున్నాయి. ఆ తర్వాత ద్వితీయార్థం లేదా ఏడాది చివరిలో చరణ్, ఎన్టీఆర్, బన్ని నటించే సినిమాలు విడుదలవుతాయి. ప్రస్తుతం మన హీరోలంతా పాన్ ఇండియా రేస్ లోకి దూసుకొచ్చారు. దీంతో ఏడాదికి కనీసం ఒక సినిమా అయినా విడుదలవ్వడం కష్టం. పాన్ ఇండియా చిత్రాల కోసం ఏళ్ల తరబడి పని చేయాల్సి ఉంటుంది. కారణం ఏదైనా అభిమానులు అంతే ఓపిగ్గా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందిప్పుడు.

## అక్క కోసం కీర్తి సుదీర్ఘ పోరాటం..!

మహానటి సినిమా తర్వాత పాన్ ఇండియా క్రేజ్ ను దక్కించుకున్న ముద్దుగుమ్మ కీర్తి సురేష్. లేడీ ఓరియంటెడ్ సినిమాలకి మోస్ట్ వాంటెడ్ గా మారిన కీర్తి సురేష్ తాజాగా వెబ్ సిరీస్ కి రెడీ అయింది. చాలా రోజుల క్రితమే కీర్తి సురేష్ మరియు రాధిక ఆప్టే ప్రధాన పాత్రల్లో అక్క అనే వెబ్ సిరీస్ ను చేయబోతున్నట్లుగా అధికారిక ప్రకటన వచ్చిన విషయం తెల్సిందే. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు వెబ్ సిరీస్ కి ఈ అమ్మడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 'అక్క' కథ మరియు కథనం చాలా బాగా నచ్చడం వల్లే కీర్తి సురేష్ ఆ ప్రాజెక్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆ వెబ్ సిరీస్ కి సంబంధించిన చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ముంబైలో 'అక్క'



వెబ్ సిరీస్ కు సంబంధించిన ప్రొడక్షన్ వర్క్ షురూ అయ్యింది. అందులో పాల్గొనేందుకు గాను కీర్తి సురేష్ ముంబై చేరుకుంది. ఇప్పటికే రాధిక ఆప్టే కూడా జాయిన్ అయ్యిందని తెలుస్తోంది. ఇక ఈ సిరీస్ లో కీర్తి సురేష్ ను గతంలో ఎప్పుడు చూడని యాక్షన్ సన్నివేశాలు చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. అన్ని వర్గాల వారిని మెప్పించే విధంగా 'అక్క' వెబ్ సిరీస్ ఉంటుందని, అంతే కాకుండా కీర్తి సురేష్, రాధిక ఆప్టే ల మధ్య సాగే సుదీర్ఘ యాక్షన్ సన్నివేశాలు కచ్చితంగా యూత్ ఆడియన్స్ కి నచ్చుతాయని అంటున్నారు. ఇద్దరు హీరోయిన్స్ మధ్య పోరాట సన్నివేశాలు అంటే కచ్చితంగా చాలా స్పెషల్ గా ఉండే అవకాశం ఉంది. కనుక ఈ సినిమా కచ్చితంగా మెప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మృణాల్.. ఎంత తెలివిగా ఆలోచిస్తోందంటే..

చాలా మంది అందాల భామలు కమర్షియల్ హీరోయిన్ గా ఎదగాలని కలలు కంటూ ఉంటారు. కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్ వస్తే స్టార్ స్టేటస్ తో పాటు అత్యధిక రెమ్యునరేషన్ కూడా అందుకోవచ్చు. అలాగే స్టార్ హీరోలతో జోడీ కట్టే ఛాన్స్ లు వెతుక్కుంటూ వస్తాయి. ఇప్పుడు శ్రీలీల అలాగే టాలీవుడ్ లో కమర్షియల్ హీరోయిన్ గా దూసుకుపోతోంది. అయితే కొంతమంది తారలు మాత్రం కమర్షియల్ సినిమాలు కంటే నటిగా తన ఐడెంటిటీ చూపించుకునే కథలతోనే ప్రయాణం చేస్తారు. కథ నచ్చితే హీరో ఇమేజ్ తో సంబంధం లేకుండా మూవీ చేయడానికి ఒప్పుకుంటారు. ఇలాంటి హీరోయిన్స్ స్టార్స్ గా ఎదగలేరు. కాని నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంటారు. నార్త్ నుంచి సీతారామం సినిమాతో టాలీవుడ్



లోకి అడుగుపెట్టిన మృణాల్ ఠాకూర్ రెండో రకంలోకి వస్తోంది. బయట హాట్ హాట్ డ్రెస్సులు బికినీ షూట్ లతో అందాల ప్రదర్శన చేసే మృణాల్ ఠాకూర్ తన సినిమాల విషయంలో మాత్రం గ్లామర్ పాత్రలు కాకుండా కచ్చితంగా కథలో బలమైన ఇంపాక్ట్ క్రియేట్ చేసే రోల్స్ చేయడానికి ఇష్టపడుతుంది. బాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ కెరియర్ తో పాటు గ్లామర్ బ్యూటీ ఇమేజ్ ఉంది. దీంతో తెలుగులో గ్లామర్ బ్యూటీ ఇమేజ్ కి దూరంగా ఉండాలని అనుకుంటుంది. అందుకే సీతారామం తర్వాత వరుసగా ఆఫర్స్ క్యూ కట్టి ఆచితూచి అడుగులు వేస్తూ హాయ్ నాన్న సినిమాలో నానికి జోడీగా కనిపించింది. ఈ సినిమాలో కూడా మృణాల్ ఠాకూర్ పాత్ర అద్భుతంగా ఉండటంతో పాటు విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. నటనకి స్కోప్ ఉన్న పాత్రలోనే తెలుగు ఆడియన్స్ ని మృణాల్ ఠాకూర్ మెప్పించింది. విజయ్ దేవరకొండకి జోడీగా ఫ్యామిలీ స్టార్ మూవీలో మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. ఈ సినిమా గ్లింప్స్ బట్టి మృణాల్ ఠాకూర్ పాత్రకి మంచి ప్రాధాన్యత ఉన్నట్లే కనిపిస్తోంది. పరశురాం సినిమాలు అంటే హీరోయిన్ పాత్రలు చాలా బలంగా ఉంటాయి. అలాగే ఫ్యామిలీ స్టార్ లో కూడా మృణాల్ పాత్రని డిజైన్ చేసినట్లు కనిపిస్తోంది. మొత్తానికి చాలా మంది నార్త్ హీరోయిన్స్ కి భిన్నంగా మృణాల్ టాలీవుడ్ లో నటిగా తనదైన బ్రాండ్ క్రియేట్ చేసుకునే ప్రయత్నం చేస్తూ ఉండటం విశేషమని చెప్పాలి.





# హైదరాబాద్‌ను మరో మెట్టు ఎక్కించాల్సిన బాధ్యత వాళ్లదే : కేటీఆర్

అంతర్జాతీయ సూచికలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. గత 10 ఏండ్లుగా స్థిరమైన పాలన, ప్రశాంత రాజకీయ వాతావరణం ఫలితంగా హైదరాబాద్ నగరంలో జీవన నాణ్యత మెరుగుపడిందని 'మెర్సర్స్ క్వాలిటీ ఆఫ్ ఇండెక్స్' తాజా నివేదిక (2023) కుండబద్దలు కొట్టింది. మెర్సర్స్ వరల్డ్‌వైడ్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ (జీవన నాణ్యత) తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు అత్యుత్తమ ర్యాంక్ దక్కింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ( ఎక్స్) ద్వారా స్పందించారు. అంతర్జాతీయ సూచీలో హైదరాబాద్ ఘనత సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. గడిచిన తొమ్మిదేండ్లకాలంలో హైదరాబాద్ నగరం ఆరుసార్లు మెర్సర్ జాబితాలో టాప్‌లోనే నిలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం కృషి చేశామని తెలిపారు. ఇప్పుడు దాన్ని మరో మెట్టు ఎక్కించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపైనే ఉందని పేర్కొన్నారు. మెర్సర్స్ జీవన నాణ్యత ర్యాంకింగ్స్‌లో బెంగళూరు, పుణే వంటి నగరాలను భాగ్యనగరం వెనక్కి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ 153వ స్థానంలో నిలువగా, పుణెకు 154, బెంగళూరుకు 156 ర్యాంకులు దక్కాయి. చెన్నై(161), ముంబై (164), కోల్‌కతా (170), న్యూఢిల్లీ (172) నగరాలు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాల్లో విదేశీ ఉద్యోగులు, ప్రవాసులు, వారి కుటుంబాల రోజువారీ జీవనం.. వాస్తవ పరిస్థితుల ఆధారంగా 'మెర్సర్స్' ఈ ర్యాంకుల్ని విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో భారత దేశానికి చెందిన 7 నగరాలు మాత్రమే చోటు దక్కించుకోగా, అందులో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవటం విశేషం. వివిధ దేశాలకు చెందిన ఉద్యోగులు, వారి కుటుంబాలకు అత్యంత నాణ్యతతో కూడిన జీవన పరిస్థితులు హైదరాబాద్ నగరంలో ఉన్నాయన్న సంగతి 'మెర్సర్స్ ఇండెక్స్' గణాంకాలతో సహా చూపుతున్నది. ఆర్థిక పరిస్థితులు, రాజకీయ హింస లేకపోవటం, సామాజిక సమానత్వం.. వంటివి ర్యాంకింగ్స్‌లో పరిగణనలోకి తీసుకోగా, భారత్‌లో మిగతా అన్ని నగరాలకన్నా హైదరాబాద్ మెరుగైన స్థానంలో నిలిచింది.



# అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ నామినేషన్.. బీఆర్ఎస్ మద్దతు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక రేపు(గురువారం) జరుగనుంది. ఈ నేపథ్యంలో స్పీకర్ స్థానం కోసం వికారాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. కాగా, ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలుమద్దతు ఇవ్వడం విశేషం. స్పీకర్ నామినేషన్ పత్రాలపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేసిన అనంతరం.. ఆయన నామినేషన్ వేశారు. ఆయన పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. దీంతో, ప్రసాద్ కుమార్ బుధవారం నామినేషన్ వేశారు.

ఇక, ప్రసాద్ కుమార్ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మరోవైపు.. స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపింది. ఈ క్రమంలో స్పీకర్ నామినేషన్ పత్రాలపై బీఆర్ఎస్ తరుపున మద్దతు తెలుపుతున్నట్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతకం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు తెలిపారు. ఇక, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి చేరుకుని మద్దతు ప్రకటించారు.

అలాగే, ఎంఐఎం తరఫున మాజిద్ ఉస్సేన్ మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా.. సహజంగానే అధికార పార్టీ స్పీకర్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా నియమిస్తే తెలంగాణ రాష్ట్ర తొలి దళిత స్పీకర్ అవుతారు. ప్రస్తుత శాసనసభలో అత్యధికులు అగ్రవర్ణాలకు చెందినవారే కావడం తెలిసిందే. తమను నియంత్రించే సత్తా ఉన్న స్పీకర్ పదవిని ప్రజల్లోకి తీసుకెళ్లి సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారనే భావన ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ



సిద్దిపేట: తెలంగాణ రాష్ట్రంలో హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ.. గౌరవెల్లి, దేవాదుల పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగుకు నీళ్లిస్తామన్నారు. జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట గౌరవెల్లి ప్రాజెక్ట్ అని విమర్శించారు. ఇంతవరకు డిస్ట్రిబ్యూషన్ కాలువల నిర్మాణమే లేదని.. టాంక్ నింపి నీళ్ళు ఇవకుంటే ఏం చేసుకుంటామని ప్రశ్నించారు. తోటపల్లి భూ నిర్వాసితుల సమస్య ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. అది సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. భూ నిర్వాసితుల సమస్యలను అప్పటి ఎమ్మెల్యే వారితో దురుసుగా ప్రవర్తించి జఠిలం చేశామన్నారు. ఈ సమస్యపై అప్పటి మంత్రి హరీశ్ రావు సానుకూలంగా స్పందించినా, స్థానిక ఎమ్మెల్యే వైఖరి కారణంగా అది ముందుకు సాగలేదన్నారు. డబుల్ బెడ్ రూంలు తమ విధానం కాదని.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అప్పటి సర్కారు అనాలోచితంగా వ్యవహరించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు గుప్పించారు.



# కొత్త సర్కార్ ప్లాన్!.. సెంట్రల్‌లోకి స్మితా సబర్వాల్.. ఆమ్రపాలి ఇన్!

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలో కొత్త టీమ్‌పై ఫోకస్ పెట్టారు. సీఎం ఆఫీసులో పనిచేసే అధికారుల ఎంపికపై రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఇక, బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న అధికారులకు స్థానచలనం మొదలైంది. కాగా, తెలంగాణలో త్వరలోనే ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే హైదరాబాద్‌లో మూడు కమిషనరేట్ల పరిధిలో కమిషనర్లు బదిలీ అయ్యారు. ఇక, ఆయా శాఖల్లో పలువురు అధికారుల జాబితా కూడా సిద్ధమైనట్టు తెలుస్తోంది. శాఖల సమీక్షలు పూర్తి కాగానే బదిలీలు ఉంటాయన్న చర్చ ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అధికారులకు స్థాన చలనం ఉంటుందనే చర్చ మొదలైంది. మరోవైపు.. సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. సెంట్రల్ సర్వీసుల్లోకి వెళ్లేందుకు స్మితా సబర్వాల్ దరఖాస్తు పెట్టుకున్నట్టు సమాచారం. కాగా, ప్రస్తుతం ఆమె.. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్మితా సబర్వాల్ ఏ సమీక్షకు హాజరు కాకపోవడం గమనార్హం. అంతకుముందు మాజీ సీఎం కేసీఆర్.. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ సామర్థ్యాన్ని మెచ్చుకుని ఆమెను కార్యదర్శిగా నియమించారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శితో పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు కూడా అప్పగించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులతో పాటు మిషన్ భగీరథ పనులు కూడా స్మితా సబర్వాల్ పర్యవేక్షించారు. తాజాగా స్మితా సబర్వాల్ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. తన 23 ఏళ్ల కేరీర్ గురించి ప్ర?స్తావిస్తూ ఆమె ఫొటోను షేర్ చేశారు. కొత్త ఛాలెంజ్‌కు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు అంటూ కామెంట్స్ చేశారు. దీంతో, ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అస్వస్థత.. దవాఖానలో చేరిక



హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనారోగ్యంతో దవాఖానలో చేరారు. ఆయన కొన్ని రోజులుగా గొంతు నొప్పితో బాధపడుతున్నారు. ఆ తీవ్రత ఎక్కువ కావడంతో నిన్న ఢిల్లీ నుంచి తిరిగి రాగానే సోమాజిగూడలోని యశోద హాస్పటల్?లో చేరారు. మంత్రికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు.. రెండు రోజులు దవాఖానలోనే ఉండాలని సూచించారు. దీంతో ఆయన యశోద హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. కాగా, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలవడంతో.. ఆయన తాజాగా భువనగిరి ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

# ఎంపీ పదవికి రాజీనామా చేసిన కొత్తా ప్రభాకర్ రెడ్డి



హైదరాబాద్ : దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కొత్తా ప్రభాకర్ రెడ్డి బుధవారం మెదక్ పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో పార్టీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు నేతృత్వంలో బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలసి రాజీనామా లేఖను అందజేశారు.

రాజీనామాకు గల కారణాలను స్పీకర్‌కు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీలు శాలువా, పుష్పగుచ్ఛంతో స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా సత్కరించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి అధికారులను ఆదేశించారు.

రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ నగరానికి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌కు శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి రానున్న విషయం తెలిసిందే.

ఐదు రోజులపాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేస్తారు. తిరిగి ఈ నెల 23న ఢిల్లీకి వెళ్లనున్నారు.

# సోనియా, రాహుల్‌ను కలిసిన మంత్రి ఉత్తమ్.. ఎంపీ పదవికి రాజీనామా



ఢిల్లీ: తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. తన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లిన ఆయన.. 10 జన్‌పథ్‌లో సోనియా గాంధీని కలిశారు. అనంతరం అక్కడి నుంచి పార్లమెంట్‌కు వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేశారు. ఈ విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ ఎంపీగా ఎన్నికైన ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

# డ్రగ్స్ ముఠాలను సహించేది లేదు: హైదరాబాద్ సీపీ హెచ్చరిక



హైదరాబాద్: డ్రగ్స్ సరఫరా ముఠాలకు రాష్ట్రంలో చోటులేదని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పబ్స్, రెస్టారెంట్లు, ఫామ్‌హౌస్ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డ్రగ్స్ ముఠాలను సహించేది లేదని.. వారిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ నూతన సీపీగా బుధవారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. "నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీఎంకు ధన్యవాదాలు. హైదరాబాద్ కమిషనరేట్‌లో విధులు నిర్వహించడం సవాళ్లతో కూడుకున్నది. డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలని సీఎం చెప్పారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ మూలాలుంటే సహించేది లేదు. దీనిపై సినీ రంగానికి చెందిన పెద్దలతో సమావేశాలు నిర్వహిస్తాం. చట్టాన్ని గౌరవించే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్.. ఉల్లంఘించే వారితో కఠినంగా వ్యవహరిస్తాం. అధికారులు, సిబ్బంది సహకారంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తా. ప్రజలకు వేగంగా సేవలు అందించేందుకు కృషి చేస్తాం" అని సీపీ అన్నారు.

# మాజీ మంత్రి మల్లారెడ్డిపై భూకబ్జా కేసు నమోదు

హైదరాబాద్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై కేసు నమోదు అయ్యింది. గిరిజనుల భూములు కబ్జా చేశారని ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మల్లారెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మల్లారెడ్డితో పాటు ఆయన అనుచరులు తొమ్మిది మందిపై కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది. శామీర్‌పేట్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిరి జిల్లా మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని సర్వేనెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుటల ఎస్టీ (లంబాడీల) వారసత్వ భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని బినామీ అనుచరులు 9 మంది అక్రమంగా కబ్జా చేసి, కుట్రతో మోసగించి భూమిని కాజేశారు. దీనికి సంబంధించి శామీర్‌పేట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయ్యింది. మొత్తం 47 ఎకరాలు కబ్జా చేశారని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డితో పాటు అతని అనుచరులు, మల్లారెడ్డి బంధువు శ్రీనివాస్ రెడ్డి, కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త గోనె హరి మోహన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (డిసిఎంఎస్)జిల్లా సహకార సంఘం వైస్ చైర్మన్ శామీర్‌పేట్ మండల వ్యవసాయ సహకార సేవా సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి శివుడు, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహా రెడ్డిలపై శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు 420 చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com